FOR ADS.......

ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964


విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :209 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ సోమవారం- 23 - మార్చి - 2026


## బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి రికార్డు స్థాయిలో ఆదాయం



30 రోజుల వ్యవధిలోనే స్వామివారికి రూ.7.19 కోట్లకు పైగా కానుకలు లభించాయి.

దేవస్థానం అధికారులు తాజాగా నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.7,19,58,064 నగదు లభించినట్లు వెల్లడించారు.

శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి దేవస్థానానికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఇటీవల భక్తుల రద్దీ పెరగడంతో హుండీ ఆదాయం భారీగా పెరిగింది. కేవలం 30 రోజుల వ్యవధిలోనే స్వామివారికి రూ.7.19 కోట్లకు పైగా కానుకలు లభించాయి. దేవస్థానం అధికారులు మిగతా..2లో

## తెలంగాణలో బిల్డింగ్ రూల్స్‌లో కీలక మార్పులు.. టీడీఆర్‌పై కొత్త గైడ్‌లైన్స్ జారీ

కొత్త నిబంధనల ప్రకారం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

40 అడుగుల రోడ్డు వద్ద 3 అంతస్తులు, 60 అడుగుల రోడ్డు వద్ద 4, 80 అడుగుల రోడ్డు వద్ద 5 అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో భవన నిర్మాణ నిబంధనలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు 21 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ఇకపై హైరైజ్‌గా పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. నిర్మాణ రంగంలో పారదర్శకత, క్రమబద్ధీకరణ లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. మిగతా..2లో

## నేను ఇక కాంగ్రెస్‌లో ఉండలేను.. జీవన్‌రెడ్డి సంచలన ప్రకటన



- తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి అత్యంత సీనియర్, గౌరవప్రదమైన నాయకుడు.
- గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కి వెన్నుముకగా ఉన్న ఆయన, ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారనే వార్త రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

జగిత్యాల, , మార్చి22 : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి అత్యంత సీనియర్, గౌరవప్రదమైన నాయకుడు. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కి వెన్నుముకగా ఉన్న ఆయన, ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారనే వార్త

## రేవంత్ రెడ్డికి పిండప్రదానం
# చేసిన కోరుకంటి చందర్...

- ఎండిన గోదావరిలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం...
- రైతుల నీటి కష్టాలపై గోదావరి ఇసుక తిన్నెల్లో బీఆర్ఎస్ విన్నుతన కార్యక్రమం...
- ఎండిన నది మధ్యలో ఆటపాటలతో వినూత్న నిరసన..



గోదావరిఖని//మార్చి 22 (ఆకాంక్ష): గోదావరిలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించి గోదావరిలోకి నీటిని విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ శివారులో ఆదివారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎండిపోయిన గోదావరి నది ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన ఈ నిరసనలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంప్రదాయ పద్ధతిలో పిండప్రదానం చేసి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గోదావరిలో నీటి సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో “గోదావరి కన్నీటి గోస” పేరుతో పెద్దపల్లి జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గతంలో 180 రోజుల పాటు పాదయాత్ర చేపట్టారని, ఆ ఉద్యమానికి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు గోదావరిలో నీటి విడుదల జరగలేదని పార్టీ నాయకులు ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మత్తుల పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.ఎండిన గోదావరి నదీ తీరాన్ని నిరసన వేదికగా మలిచిన బీఆర్ఎస్ శ్రేణులు మహిళా నాయకురాళ్లతో కలిసి గ్రామీణ ఆటపాటల రూపంలో ప్రత్యేక నిరసన తెలిపారు. నది ఇసుకలో ఆటపాటలు నిర్వహిస్తూ

## రైతాంగం పచ్చగా ఉంటే
# రాజ్యం బాగుంటుంది

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట జిల్లాలో పర్యటించారు.
- నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు.
- అలానే అక్కడే 40 కోట్లతో చేపట్టనున్న ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు.



సిద్ధిపేట జిల్లా, మార్చి22: ఇవాళ(ఆదివారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట జిల్లాలో పర్యటించారు. నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. అలానే అక్కడే 40 కోట్లతో చేపట్టనున్న ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..‘ గత ప్రభుత్వ నిర్వాకల వల్ల మిగతా..2లో

## ఇరాన్ పై దాడులను ఖండించడంలో మోదీ సర్కార్ విఫలం- ఇది పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం



- ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఖండించడంలో మోదీ ప్రభుత్వం విఫలం
- ఇది భారత నాగరికత విలువలకు ద్రోహం చేసినట్లే- కాంగ్రెస్ విమర్శలు

ఢిల్లీ : ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ లు చేస్తున్న దాడుల విషయంలో మోదీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇరాన్ పై జరుగుతున్న వైమానిక దాడులను, ఆ దేశ అగ్రనేతల హత్యలను, అక్కడ బలవంతపు

## జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన
## రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు

- జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన
- జైళ్లలో రద్దీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక ఇవ్వాలన్న సుప్రీంకోర్టు
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు



ఢిల్లీ : దేశవ్యాప్తంగా జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఖైదీల రద్దీని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న వసతులపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం, ఈ ఏడాది మార్చి 1 నాటికి జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య, మంజూరైన సామర్థ్యం వంటి వివరాలను మే 18 లోగా అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని హోంశాఖ కార్యదర్శులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా..2లో

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ
# ప్రధాని మోదీ కీలక భేటీ
## ఢిల్లీలో మంత్రులతో ప్రధాని మోదీ సమీక్ష

- పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఇంధన కొరతపై ప్రధాని సమీక్ష
- నిరంతరంగా ఇంధన సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష



ఢిల్లీ : పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులను సమీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సీనియర్ మంత్రులతో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై ప్రధాని మోదీ చర్చించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి మిగతా..2లో

## మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ



- ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తామని లోకేశ్ అప్పట్లో ప్రకటించారు.
- విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారు.
- ఇచ్చిన మాటకు కట్టుబడి, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## నిరుపేదను ఆదుకోవాలన్న
# సంకల్పంతోటే జీవిత భీమా

- మానవీయ కోణంలో ఆలోచించి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు.
- రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేదను ఆదుకోవాలన్న సంకల్పంతో జీవిత భీమా తీసుకువచ్చామని తెలిపారు.



హైదరాబాద్, మార్చి 22: రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేదను ఆదుకోవాలన్న సంకల్పంతో జీవిత భీమా తీసుకువచ్చామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. తన పాదయాత్ర సమయంలో కుటుంబ పెద్దను కోల్పోయిన వారిని చూశానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాష్ట్రంలో పర్యటించే సమయంలో దయనీయమైన, నిస్సహాయమైన కుటుంబాలను చూశారని పేర్కొన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మిగతా..2లో

## మిత్తల్ స్టీల్ ప్లాంట్
# రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్
## కూటమి మంత్రులు

- ఉక్కు కర్మాగారం రాకతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు
- మొత్తం 5,465 ఎకరాల్లో రెండు దశల్లో ప్రాజెక్టు సాకారం
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరణ



అమరావతి : ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్ అని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఉక్కు కర్మాగారం రాకతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మొత్తం 5,465 ఎకరాల్లో రెండు దశల్లో సాకారం కానున్న ఈ ప్రాజెక్టుతో అనకాపల్లి జిల్లా రూపురేఖలే మారిపోతాయని తెలిపారు. అదే విధంగా రేపు రాజయ్యపేటలో జరిగే స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఈ సందర్భంగా మంత్రులు వివరించారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఆర్సెలార్ మిట్టల్ ఉత్తరాంధ్రకు వచ్చిందని మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

## రేవంత్ రెడ్డికి పిండప్రదానం చేసిన కోరుకంటి చందర్...

సాగునీటి సమస్య తీవ్రతను ప్రజల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. సాంప్రదాయ గ్రామీణ శైలిలో పాటలు పాడుతూ రైతుల కష్టాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఆవేదన చెందుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఆ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ సీఎం చిత్రపటానికి పిండప్రదానం చేశారు. ఈ చర్య ద్వారా రైతుల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సంకేతాత్మకంగా తెలియజేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న భాగాలకు, ఫిల్లర్లు మరియు ఇతర నిర్మాణాలకు కనీస మరమ్మత్తులు కూడా చేపట్టక పోవడం వల్లే రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే మరమ్మత్తులు చేపడితే గోదావరి నదిలో నీటి నిల్వలు పెరిగి రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. రైతుల జీవనాధారం వ్యవసాయమేనని, దానికి మూలమైన నీటి వనరుల పునరుద్ధరణలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోందని కోరుకంటి చందర్ హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల వేదనను అర్థం చేసుకుని సాగునీటి సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన రామగుండంలో ప్రజలు ఇప్పటికీ మురికి నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొని ఉందని ఆరోపించారు. తాగునీటి వంటి ప్రాథమిక అవసరాల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలకే పరిమితమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతు, కార్మిక, సామాన్య ప్రజల సమస్యలను ఎత్తిచూపేందుకే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమం అంతటా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్రదేశాన్ని మార్మోగించారు. సాగునీరు అందించాలి, కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించాలి, రైతులను కాపాడాలనే డిమాండ్లతో నినాదాలు చేశారు. గోదావరి ఎండిపోవడం కేవలం ప్రకృతి సమస్య మాత్రమే కాకుండా పాలనా వైఫల్యానికి కూడా సంకేతమని నిరసనకారులు పేర్కొన్నారు. ఎండిపోయిన నది మధ్యలో గ్రామీణ ఆటపాటలతో నిరసన తెలపడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రైతుల ఆవేదన, నీటి కొరత, ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ఈ నిరసన కార్యక్రమంలో గోపు ఐలయ్య యాదవ్, మురళీధర్ రావు, తాళ్ల రాజయ్య, తోకల రమేష్, కర్క సుజాత, కృష్ణవేణి, పద్మ, అచ్చ వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెడి సదానందం, కిరణ్ జీ, రామరాజు, బాలరాజు, దాసరి తదితరులు పాల్గొన్నారు.

## అధికార పీఠంపై 8,931 రోజులు... ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

చారిత్రక మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఈ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దేశానికి 8,931 రోజుల పాటు సేవను పూర్తి చేసుకోవడం నిజంగా ఒక అద్భుతమైన విజయం. ఈ అసాధారణ ఘనత, మన దేశ ప్రగతి, శ్రేయస్సు పట్ల ఆయనకున్న అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి, అవిశ్రాంత నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. 2047 నాటికి 'వికసిత భారత్'ను నిర్మించాలన్న ఆయన దార్శనికత మనందరిలో స్ఫూర్తిని నింపుతూ, దేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తోంది. దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చే ఈ ప్రయాణంలో ఆయనకు మరింత శక్తి, మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రధాని మోదీ కీలక భేటీ

ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు.

### గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు

మరోవైపు గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపులను పెంచింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాను పెంచేందుకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ దరఖాస్తులను 10 రోజులలోపు పరిష్కరించాలని పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ ఆదేశించింది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, పీఎన్‌జీకి మారాలని పట్టణ, నగరాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు సూచించింది. గృహ ఎల్పీజీ సరఫరా స్థిరంగా ఉందని, పంపిణీ కేంద్రాల వద్ద ఎక్కడా సరఫరా నిలిచిపోలేదని, పేర్కొంది. భయాందోళనలతో చేసే బుకింగ్‌లు కూడా తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

## మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ

అమరావతి : యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మరో కీలక హామీని ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. ప్రముఖ సంఘ సంస్కర్త, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో ఈ మేరకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తామని లోకేశ్ అప్పట్లో ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీని ప్రకారం, ప్రతి ఏటా మార్చి 23న అన్ని ప్రభుత్వ శాఖలు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నాయి. కోనసీమ ప్రాంతానికి చెందిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్త. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, 19వ శతాబ్దం తొలినాళ్లలోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటుపడ్డారు. విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారు. ఆయన సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## తెలంగాణలో బిల్డింగ్ రూల్స్‌లో కీలక మార్పులు.. టీడీఆర్‌పై కొత్త గైడ్‌లైన్స్ జారీ

40 అడుగుల రోడ్డు వద్ద 3 అంతస్తులు, 60 అడుగుల రోడ్డు వద్ద 4, 80 అడుగుల రోడ్డు వద్ద 5 అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. అయితే, 10 అంతస్తులు దాటిన భవనాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులు దాటిన భవనాలకు 5 శాతం టీడీఆర్ లోడింగ్ కల్పించారు. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో నిర్మించే 18 నుంచి 21 మీటర్ల ఎత్తున్న భవనాలకు టీడీఆర్ వాడకాన్ని తప్పనిసరి చేశారు. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ ద్వారా సెట్‌బ్యాక్‌లో సడలింపులు ఇవ్వగా, హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతించారు. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసే సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి ముందు చెల్లించాల్సి ఉంటుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్పులు నిర్మాణ రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

## బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి రికార్డు స్థాయిలో ఆదాయం

తాజాగా నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.7,19,58,064 నగదు లభించినట్లు వెల్లడించారు. నగదుతో పాటు 122 గ్రాముల బంగారం, 6 కిలోల 550 గ్రాముల వెండిని కూడా భక్తులు స్వామివారికి సమర్పించారు. వీటితో పాటు పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభించాయి. ఇటీవల ముగిసిన ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కారణంగానే హుండీ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆలయ ఈవో, సిబ్బంది పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘా నడుమ హుండీ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు.

## నిరుపేదను ఆదుకోవాలన్న సంకల్పంతోటే జీవిత భీమా

మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడ లేని విధంగా మొట్టమొదటి సారి కుటుంబ జీవిత భీమా ప్రవేశపెట్టాము. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకంగా నిధులు కేటాయించాము. ఈ ఏడాది కూడా ప్రతి నియోజకవర్గానికి వెయ్యి ఇళ్లు కేటాయిస్తున్నాము. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉంటే.. కోటి 6 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి ఆహార భద్రత కల్పించాము. క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఉద్యోగులకు ఇస్తున్నాము. రాష్ట్రంలో 14 వేల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం పూర్తి చేశాము'.. 'ప్రతి పేదవాడికి మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాన్ని జోన్‌లుగా విభజించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నాము. రాష్ట్ర వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాము. వరికి భోనస్ ఇస్తున్నాము. ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించాము. గోదావరి పుష్కరాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నాము. బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబోతున్నాము.

## మిత్తల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్ : కూటమి మంత్రులు

### మొదటి పేజి తరువాయి



ఉత్తరాంధ్రకు మరో మణిహారం: ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించేలా సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నారని తెలిపారు. మొత్తం 1.05 లక్షల కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలవబోతోందని 2029 కల్లా పూర్తి కానుందని వివరించారు. జూన్ లో భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి సర్వీసులు ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని 20 నెలల్లో చంద్రబాబు చేసి చూపించారని ఎంపీ కలిశెట్టి తెలిపారు. గత వైఎస్సార్సీపీ పాలనలో ఐదేళ్లల్లో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర ద్రోహిగా జగన్ నిలిచిపోయాడని దుయ్యబట్టారు. జగన్ కన్నతల్లిపైనే సొంత పత్రికలో తప్పుగా మాట్లాడించి వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. సమాజం పట్ల, తల్లి, చెల్లి పట్ల కనికరం లేనివాడు నాయకుడిగా ఎలా రాణిస్తాడని నిలదీశారు. రాష్ట్ర ఆడబిడ్డకు అన్యాయం జరిగితే అండగా నిలిచే బాధ్యత తెలుగుదేశం పార్టీదిని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. విజయమ్మ అయినా మరే ఇతర మహిళ అయినా న్యాయం కావాలంటే అండగా నిలబడతామని తేల్చి చెప్పారు. స్వామివారి లడ్డూను అపవిత్రం చేసి జగన్ మహాపాపం చేశాడని ఆరోపించారు. జగన్ లాంటివాడు సమాజానికి ప్రమాదమని, సంఘ బహిష్కరణ చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కలిశెట్టి వ్యాఖ్యానించారు. "ఉత్తరాంధ్ర అభివృద్ధిని 20 నెలల్లో చంద్రబాబు చేసి చూపించారు. గత వైఎస్సార్సీపీ పాలనలో ఐదేళ్లల్లో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్ గా భవిష్యత్తులో నిలవబోతుంది"-అనిత,హోంమంత్రి "దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఆర్సెలార్ మిట్టల్ ఉత్తరాంధ్రకు వచ్చింది. ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించేలా సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నారు. దాదాపు రూ. 1.5 లక్షల కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలవబోతోంది. 2029వ సంవత్సరానికి ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది"-కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ యువతకు ఉద్యోగావకాశాలు: దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను సీఎం చంద్రబాబు అనకాపల్లి జిల్లాలో రేపు ప్రారంభిస్తారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సుమారు లక్షా 35 వేల 964 కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న ఈ స్టీల్ ప్లాంట్ దేశంలోనే అతిపెద్దదిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్ష మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. విశాఖ త్వరలోనే వాణిజ్య నగరంగా మారుతుందని పెట్టుబడులు, పరిశ్రమలు భారీగా తరలివస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతో సహా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరుకానునుండటం విశేషం.

## జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు

### మొదటి పేజి తరువాయి

మహిళా ఖైదీలతో పాటు వారితోపాటు ఉంటున్న చిన్నారుల భవిష్యత్తుపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఆయా చిన్నారులకు అందుతున్న విద్య, ఆరోగ్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని కోరింది. జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అమికస్ క్యూరీ అందించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు జైళ్లలో పాలనా సంస్కరణలు అనివార్యమని అభిప్రాయపడింది. ఈ విచారణను సమర్థంగా పరిగణనలోకి తీసుకోవడానికి తాజా సమాచారం అందుబాటులో ఉండటం అత్యవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నమోదు చేసిన గణాంకాలు 2023 సంవత్సరానికి సంబంధించినవని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ కేసు తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది. "అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ అధికార పరిధిలోని అన్ని జైళ్లకు సంబంధించిన తాజా, సమగ్ర గణాంకాలతో కూడిన జైలు రికార్డులు పొందుపరిచాలి. ఈ అఫిడవిట్ లో ప్రతి జైలు వారీ సామర్థ్యం, మొత్తం ఖైదీల సంఖ్య, ప్రతి జైలులో అధిక రద్దీ శాతం, రద్దీని పరిష్కరించడానికి ప్రతిపాదించిన చర్యలు, మహిళా జైళ్ల వివరాలు, మహిళా ఖైదీలు, వారితో పాటు వచ్చే పిల్లలకు అందించే విద్యా, వైద్య సౌకర్యాలు, మంజూరైన జైలు సిబ్బంది సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీలు, వాటిని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యలు, అలాగే జైలు పరిపాలనకు సంబంధించిన అన్ని అనుబంధ అంశాలు ఉండాలి. 2026 మార్చి 1 నాటికి కటాఫ్ తేదీగా వివరాలను అందించాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మే 18 లోగా హోం సెక్రటరీతో అవసరమైన వివరాలతో కూడిన సమగ్ర అఫిడవిట్లను దాఖలు చేయాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన అఫిడవిట్ల కాపీలను సుప్రీం కోర్టు రిజిస్ట్రీ, ఏర్పాటు చేసిన అమికస్‌కు పంపుతుంది. వారు అందించిన గణాంకాలు, సమాచారాన్ని పరిశీలించి అమికస్ క్యూరీ ఒక సమగ్ర నివేదికను తయారు చేస్తారు."

### సోషల్ మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు ఆందోళన

మరోవైపు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు



శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారతాయని చెప్పింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాల్లో అప్‌లోడ్ చేసి, ప్రజల్లో పక్షపాత ధోరణిని సృష్టిస్తున్నారంటూ ఓ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.

## నేను ఇక కాంగ్రెస్‌లో ఉండలేను.. జీవన్‌రెడ్డి సంచలన ప్రకటన

### మొదటి పేజి తరువాయి



రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో జీవన్ రెడ్డి పార్టీ హైకమాండ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కాంగ్రెస్‌లో నాకు గౌరవం లేదు.. ఇక ఈ క్షోభను భరించలేను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి.

### జీవన్‌రెడ్డి ఏమన్నారంటే..

ఈ నెల 25వ తేదీన తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయం ఉంటుందని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాలుగా తనతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వాలని అన్నారు. జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో 25న తన ముఖ్య నేతలతో సమావేశమై ఓ నిర్ణయం తీసుకుంటానని చెప్పుకొచ్చారు. పార్టీలో కొనసాగలేనని.. ఈ క్షోభ భరించలేనని అన్నారు. పార్టీలో తనకు గౌరవం లేదని తెలిపారు. తనకు అన్యాయం చేసిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఒకరని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి వల్ల తన గౌరవానికి భంగం కలిగిందన్నారు. తనకు రేవంత్ అంటే గౌరవం ఉన్నా.. తన సమస్యకు పరిష్కారం ఆయన దగ్గర కూడా లేదని తెలిపారు. పదిమంది ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టగలరా..? అని ప్రశ్నించారు. మేడిగడ్డను రిపేర్ చేసే బాధ్యత లేదా..? అని నిలదీశారు. రైతాంగం సాగునీటికి ఇబ్బంది పడుతోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

### జీవన్ రెడ్డి అసంతృప్తికి కారణాలివే..

నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడినా, ప్రస్తుతం పార్టీలో తనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి (ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి) ఎమ్మెల్యే సంజయ్, ఇతర నేతల చేరికలు, వారికి పార్టీలో ప్రాధాన్యం పెరగడం జీవన్ రెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

### ముఖ్య నేతల సమావేశం..

తన రాజకీయ భవిష్యత్తును తేల్చుకోవడానికి ఈ నెల 25వ తేదీన జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో తన అనుచరులు, ముఖ్య నేతలతో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు కార్యకర్తల సూచనల మేరకు తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. 'నాలుగు దశాబ్దాలుగా నాతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వండి. మీ అభిప్రాయం మేరకే నా భవిష్యత్ నిర్ణయం ఉంటుంది' అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌పై ప్రభావం..?

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జీవన్ రెడ్డి వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేత పార్టీని వీడితే, అది కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బనేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సీనియర్లను కాపాడుకోలేకపోతున్నారనే విమర్శలు కాంగ్రెస్ హైకమాండ్‌పై వచ్చే అవకాశం ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

### ప్రత్యామ్నాయ దారి..

ఆయన స్వతంత్రంగా ఉంటారా లేక మరేదైనా పార్టీలో చేరుతారా అన్నది ఉత్కంఠగా మారింది. ఒకవేళ ఆయన పార్టీ మారితే జగిత్యాల సమీకరణలు పూర్తిగా మారిపోనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత అలిగితే పార్టీ అధిష్ఠానం (ముఖ్యమంత్రి లేదా టీపీసీసీ అధ్యక్షుడు) వెంటనే రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. 25వ తేదీ లోపు ఆయనను శాంతింపజేస్తారా లేక ఆయన తన దారి తాను చూసుకుంటారా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం

### మొదటి పేజి తరువాయి

రూ.9 వేల కోట్లు వేయనున్నామని వెల్లడించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి, రుణమాఫీ కూడా చేశామని గుర్తు చేసిన సీఎం, వరికి బోనస్ ఇస్తున్నామని, వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నామని వివరించారు. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి : తెలంగాణ ప్రాంతం నిజాం కాలంలోనే వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగా ఉండేదని గుర్తు చేసిన సీఎం, రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలని పిలుపునిచ్చారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించే వారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల రంగారెడ్డి జిల్లా పంటల సాగు తగ్గిందన్నారు. ఫలితంగా కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోందన్న ఆయన, పంట మార్పిడి ద్వారా మాత్రమే వ్యవసాయం లాభసాటి అవుతుందని స్పష్టం చేశారు. సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకుని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా, ఒక్కో పంటకు ప్రసిద్ధి. తెలంగాణలో సారవంతమైన భూములున్నాయి. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. - రేవంత్ రెడ్డి, సీఎం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులున్నారు. వీరందరికీ తొలి విడతలో ఒక ఎకరం వరకు సాయం అందించనున్నారు. దీనికోసం రూ.3,590 కోట్లు ఆదివారం ఆర్బీఐ ద్వారా బ్యాంకులకు, అటు నుంచి రైతులకు చేరవేయనున్నారు. అయితే ఆదివారం సెలవు కావడంతో ఈ నిధులు సోమవారం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. రెండో విడతగా ఇరవై రోజుల అనంతరం రూ.2,650 కోట్లు, తర్వాత మూడో విడతగా రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నారు. తెలంగాణలోని మొత్తం రైతుల్లో 24.32 లక్షల మందికి ఎకరం వరకు వ్యవసాయ భూమి ఉంది. మిగిలిన 48.68 లక్షల మందికి ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూములు ఉన్నాయి.

### పంటల మార్పిడి చేస్తే బోనస్ :



పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్రంలో అధిక కొరత, డిమాండ్ ఉన్న పంటలకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదివారం నర్మెటలో జరిగే రైతు ఉత్సవాల్లో కొత్త పంటలకు బోనస్ పై విధాన నిర్ణయం ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో 30 రకాల పంటలను పండిస్తున్నారు. వీటిని 2.14 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో 1.28 కోట్ల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి ప్రధాన పంటలుగా వేస్తున్నారు. తర్వాత స్థానాల్లో మొక్కజొన్న, కందులు, సోయాబీన్ ఉన్నాయి. ప్రభుత్వం రెండేళ్లుగా సన్నవడ్లకు ప్రోత్సాహకం అందజేస్తోంది. దీనికోసం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తోంది. దీనికి 2025-26 బడ్జెట్ లో రూ.1,800 కోట్లు కేటాయించింది. ఆయిల్ పామ్ తో పాటు ఇతర నూనె గింజలు, మొక్కజొన్న, పసుపు, పప్పు ధాన్యాలు, వేరు శనగ పంటలకు సైతం బోనస్ ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు పెరగడంతో ప్రభుత్వం దానిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే 2026-27 బడ్జెట్ లో పంటల బోనస్ కు మొత్తంగా రూ.3,500 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది.

### రైతాంగం పచ్చగా ఉంటే రాజ్యం బాగుంటుంది: మంత్రి తుమ్మల

ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నా రైతులకు భరోసా ఇస్తూ రూ. 2 లక్షల ఏకబిగిన రుణమాఫీ చేశాం. రైతాంగం పచ్చగా ఉంటే రాజ్యం బాగుంటుంది. మొదటి రెండేళ్లలో లక్షా 4 వేల కోట్లు రైతులకు ఇచ్చాం. రైతు కళ్లలో ఆనందం చూసే దాకా ఎవరేమన్నా వెనకడుగు వేయం. రాబోయే రోజుల్లో దిగుమతి చేసుకుంటున్న పంటలకు కూడా బోనస్ ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఈ రోజు ఆయిల్ పామ్ పంట 30 జిల్లాల్లో వస్తున్నది. అందుకే ఆగమేఘాల మీద ఇక్కడ ఆయిల్ ఫ్యాక్టరీ పూర్తి చేసి ప్రారంభించుకుంటున్నాం' అని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ..'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ రెండేళ్లలో అమలు చేస్తూ వస్తున్నాం. ఎవరెన్ని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డికి ఒక విజన్, దూరదృష్టి ఉంది. కాంగ్రెస్, సోనియా ఒక మాట ఇస్తే అది నెరవేరుతుంది. కాంగ్రెస్ మైనార్టీల, పేదల, బీసీ, ఎస్సీల పక్షపాత ప్రభుత్వం' అని అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ..' తెలంగాణ వస్తే ప్రజల ఆశలు నెరవేరుతాయన్న ఆశలు ప్రజల్లో ఉన్నట్టుగానే పక్కనే ఉన్న తపసుపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు అందేలా చూడాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నాను. మల్లన్నసాగర్ కు భూములిచ్చిన రైతులకు ఇంకా చాలా మందికి పరిహారం అందలేదు. ప్రాజెక్టుకు భూములు త్యాగం చేసిన దుబ్బాక కు సాగు నీరు అందించాలని సీఎం కు విజ్ఞప్తి. గతంలో నేను ఎమ్మెల్యేగా పని చేసిన దుబ్బాక అభివృద్ధికి కృషి చేయాలి' అని ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. ' రైతుకు కావాల్సింది గిట్టుబాటు ధర. వ్యవసాయానికి వాతావరణం అనుకూలంగా ఉండాలి. ఎలాంటి వాతావరణం లో అయినా సాగు చేసే పంట ఆయిల్ పామ్. ఈ చుట్టుపక్కల రైతులంతా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలి. ఈ ఫ్యాక్టరీ నీ ఉపయోగించుకోవాలి. మాది రైతు రాజ్యం' అని ఆయన అన్నారు. 'ఈ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. రైతును రాజు చేయడంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నది. కొంతమంది గుంటనక్కలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల పక్షాన పనిచేస్తాం. సాధబైనామ సమస్యలను కూడా కొద్ది రోజుల్లో పరిష్కరిస్తాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. సిద్దిపేటలో పింక్ కలర్ చొక్కాలు వేసుకున్న పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. మా టైం లో కట్టింది అంటున్నారు.. మీరు తెల్ల కాగితాన్ని నల్లకాగితంగా చేస్తే, మా ప్రభుత్వం వచ్చాక నిర్మించాం. ఒంటి నిండా విషం నింపుకున్న వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# సంపాదకీయం

## పశ్చిమాసియా సంక్షోభంలో మహాపరాధులు

'మానవ వ్యవహారాలలో దుష్టశక్తుల పాత్రపై మీరు మరి కొంచెం ఎక్కువగా ఆలోచించాలి...' ఇటీవల కీర్తిశేషుడు అయిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆంద్రే బెటీల్ ఒక వ్యక్తిగత లేఖలో నాకు అలా సూచించారు. నేను నా రచనా వ్యాసంగంలో గాంధీ లాంటి సజ్జనులు, సత్ సంకల్పుల మీదనే దృష్టిని కేంద్రీకరిస్తున్నానని ఆయన భావించారు. అయితే సజ్జనుల కంటే ఎక్కువగా చరిత్రను దుష్టస్వభావులే సృష్టిస్తున్నారు, నిర్మూలిస్తున్నారు. ఇది నిజం. పశ్చిమాసియాలో ప్రస్తుత యుద్ధం ప్రజ్వరిల్లినప్పుడు ప్రొఫెసర్ బెటీల్ సూచన నాకు జ్ఞప్తికి వచ్చింది. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసికట్టుగా ఇరాన్‌పై పోరాడుతున్నాయి. ఈ వినాశనకర ఘర్షణకు ప్రధాన కారకులైన ఆ మూడు దేశాల నాయకుల వ్యక్తిత్వాలను యుద్ధం ఎలా సువ్యక్తం చేసిందో నిశితంగా పరిశీలించడం చాలా ముఖ్యం. తొలుత, యుద్ధం తొలిరోజునే మరణించిన ఇరాన్ అధినేత అయతొల్లా ఖమేనీ విషయాన్ని చూద్దాం. బాంబుల వర్షం కురుస్తున్నా సురక్షిత ప్రదేశానికి వెళ్లడానికి ఖమేనీ నిరాకరించాడు. ఉద్దేశపూర్వకంగా మరణాన్ని ఆహ్వానించాడు. తన అంతిమ రోజుల్లో ఖమేనీ ప్రదర్శించిన ధైర్యం ఆయన నైతిక ఉన్నతికి తార్కాణం. ఈ కారణంగా ఖమేనీని సామ్రాజ్యవాద వ్యతిరేక యోధుడుగా వామపక్ష మేధావులు కొంతమంది కీర్తిస్తున్నారు. ఖమేనీ వీరోచితంగా మరణించాడు, సందేహం లేదు. అయితే ఇది, ఆయన సజీవుడుగా ఉన్నప్పుడు తన అపార అధికారాలను ఏ విధంగా ఉపయోగించారు అన్న వాస్తవాన్ని అస్పష్టపరచకూడదు. ఇరాన్ సర్వాధినేతగా ఖమేనీ ముందు మూడు మార్గాలు ఉన్నాయి. అవి, తన ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు ప్రతిస్పందించి, రాజకీయ ప్రక్రియల నుంచి మతాచార్యులను ఉపసంహరించి, స్వేచ్ఛాయుత సమాజాన్ని అభివృద్ధిపరచడం. మహిళలపై విధించిన అన్ని ఆంక్షలను తొలగించి దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవితంలో వారిని పూర్తిగా భాగస్వాములను చేసి ఉండవలిసింది. ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాలకు ఉన్నట్టుగానే ఇరాన్‌కు అపార చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఆ దేశాలలో లేని విధంగా ఇరాన్‌లో విద్యాధికులు అధికంగా ఉన్నారు. 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు కాలంలో ఇరానియన్ మహిళలు విద్యారంగంలోనూ, వివిధ వృత్తులలోను కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. గల్ఫ్ దేశాలకు లేని సమున్నత సాంస్కృతిక చరిత్ర ఇరాన్‌కు ఉన్నది. పురాతన నాగరికతకు నెలవైన ఇరాన్ నుంచి చాలామంది సుప్రసిద్ధ తాత్వికులు, మహాకవులు, సంగీతవేత్తలు ప్రభవించారు. సంపద్వంతమైన స్వావలంబన ఇరాన్‌ను నిర్మించేందుకు ఆ సముదాత్త చరిత్రను ఖమేనీ ఉపయోగించుకుని ఉండవల్సింది. అధికారంలో ఉన్న సుదీర్ఘకాలంలో ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఖమేనీ కృషిచేసి ఉండవల్సింది. లేదూ, సింగపూర్ తరహాలో ప్రజాస్వామ్య పురోగతిని ఉపేక్షించి ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి ఉండవలిసింది. అయితే ఈ రెండు మార్గాలకు భిన్నంగా ఖమేనీ పాలన మూడో మార్గాన్ని అనుసరించింది. స్వదేశంలో ప్రజలపై తీవ్ర అణచివేత విధానాలను అమలుపరిచింది. వైదేశిక నీతిలో విస్తరణవాదానికి ప్రాధాన్యమిచ్చింది. లెబనాన్, యెమెన్‌లో తనకు అనుకూలంగా ఉండే సాయుధ బృందాలను ప్రోత్సహించింది. సిరియాలో అస్సాద్ క్రూరపాలనకు మద్దతునిచ్చింది. తద్వారా ఆ దేశాలు అతలాకుతలమవడంలో కీలక పాత్ర వహించింది. మరీ ముఖ్యంగా ఖమేనీ నేతృత్వంలో ఇరాన్ దురహంకారపూరితంగా ఇస్లామిక్ ప్రపంచానికి తనకుతాను నాయకుడుగా నిర్దేశించుకున్నది. యూదు రాజ్యమైన ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతను ప్రదర్శించింది. ఇజ్రాయెల్‌ను సుదీర్ఘకాలంగా పరిపాలిస్తున్న బెంజమిన్ నెతన్యాహు సైతం ఖమేనీ వలే మత తీవ్రవాది. ఎటువంటి దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించే వ్యక్తి. కుటుంబ నేపథ్యమే నెతన్యాహును యూదు మత తీవ్రవాదిగా మార్చింది. తండ్రి కరడుగట్టిన మితవాద యూదు చరిత్రకారుడు. సైనికాధికారిగా ఉన్న సోదరుడు 1976లో ఉగ్రవాదుల చెర నుంచి ఇజ్రాయెలీలను విడిపించడంలో ప్రాణాలు కోల్పోయిన వీరుడు. ప్రధానమంత్రిగా నెతన్యాహు, పాలస్తీనియన్లకు స్వతంత్ర దేశం ఏర్పాటును ఎటువంటి మినహాయింపులు లేకుండా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పాలస్తీనియన్ అథారిటీ పట్ల అతడి అణువణువులో అపార ద్వేషమున్నది. ఆ సంస్థ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఒక దశలో హమాస్‌కు సైతం అతడు మద్దతునిచ్చాడు. అక్టోబర్ 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి నెతన్యాహు చాలా పైశాచికంగా ప్రతిస్పందించాడు. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో 75 వేల మందికి పైగా పౌరులను హతమార్చింది. లక్షలాది ఇజ్రాయెలీలను నిరాశ్రయులను చేసింది. ఈ చర్యలకుగాను అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం నెతన్యాహుపై యుద్ధ నేరస్థుడుగా అభియోగం మోపింది. నిజానికి అతడిని ఆ విధంగానే పరిగణించితీరాలి. నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అధికారంలో కొనసాగాలంటే వాటి అడ్డు తొలగించుకోవాలి. అందుకే ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రేరేపించి, కొనసాగిస్తున్నాడని నెతన్యాహును పలువురు నిందిస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధంలో మూడో ప్రధాన వ్యక్తి డోనాల్డ్ ట్రంప్ విషయమేమిటి? అధికార లాలసే ఈయననూ నడిపిస్తున్నది. క్రైస్తవ ధర్మాన్ని పరిపూర్ణంగా అనుసరించే వ్యక్తినని ట్రంప్ చెప్పుకుంటాడు. అయితే ఆ ధర్మం నిర్దేశించిన దివ్య ప్రవర్తనా నియమావళిని ఈ మహాశయుడు పాటించడు. ఈ శతాబ్ది మొదటి దశకంలో డెమొక్రాటిక్ పార్టీ సభ్యుడుగా ఉన్న ట్రంప్ ఆ తరువాత 2016లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికయ్యాడు. 2024లో యుద్ధ వ్యతిరేకత

# కోరల్లేని చట్టం... ఉండీ ఏం లాభం?




లాభార్జన మీద యావతో నిజాయతీకి నిలువు పాతరేసి మోసాలతో వ్యాపారాలు చేసేవారు సమాజానికి తీరని హాని చేస్తారని వేమన ఏనాడో ఈసడించాడు. దురదృష్టవశాత్తు అలాంటి దగాకోరు సంతతి దేశవ్యాప్తంగా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ఏదైనా సరకును అమ్మేటప్పుడు ఆ మాయగాళ్లు చేసే ఆర్భాటపు ప్రచారాలకు అంతే ఉండదు. చెప్పిన మాటకు కట్టుబడి ఉండటంలో సత్యహరిశ్చంద్రుడికి వేలువిడిచిన వారసులం అన్నంతగా ఊదరగొడతారు. నాణ్యతలో తమ ఉత్పత్తులకు తిరుగుండదంటూ తెగ డప్పు కొట్టుకుంటారు. వాస్తవంలో మాత్రం 'వాడు నీళ్లు ఉన్నాయని చెప్పిన చోట కనీసం బురద కూడా కనిపించదు' అని అంటాం కదా కొందరు కేటుగాళ్ల గురించి... వీళ్ల మోసాలూ అచ్చం అలాగే ఉంటాయి. ఇంకోపక్క తీసుకున్న డబ్బుకు వినియోగదారులకు బాధ్యతగా సేవలు అందించాల్సిన సంస్థల్లోనూ కొన్ని ఎవడెలా పోతే మాకెందుకులే అన్నట్లు నేరపూరిత నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి. నమ్మిన పాపానికి డబ్బూ పోయి, శనీ పట్టింది అన్న చందంగా పరిస్థితులు అఘోరిస్తున్నాయి. వినియోగదారుల రక్షణకు తెచ్చిన చట్టం క్షేత్రస్థాయిలో కోరల్లేని పులిగా తయారుకావడం వల్లే జనం జేబులు ఇంతగా గుల్లవుతున్నాయి! తమ కాస్మెటిక్, లేజర్ క్లినిక్‌కు వస్తే అందం రెట్టింపు అవుతుందని, స్పష్టమైన ఫలితాలు చూపిస్తామని హైదరాబాద్‌లో ఒక సంస్థ తెగ ప్రచారం చేసింది. దాన్ని నమ్మి ఒక మహిళ రూ.62 వేలు చెల్లించి చికిత్స తీసుకుంటే, అసలుకే మోసం వచ్చింది! చికిత్సలో లోపాల వల్ల ఆమె తన సహజ రంగునే కోల్పోయారు. హెల్త్ ప్రొడక్ట్‌తో బరువు పెరుగుతారన్న ప్రకటన చూసి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తి వేలకు వేలు పోసి దాన్ని కొని వాడితే- ఒళ్లుచేసే సంగతి అటుంచితే, అతను ఇంకాస్త బక్కపలచగా తయారయ్యాడు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఒక ప్రముఖ కంపెనీ ఫ్రీజర్ కొంటే, వారంటీ గడువు తీరక ముందే అందులో సాంకేతిక సమస్యలు వచ్చాయి. సర్వీస్ సెంటర్‌ను సంప్రదిస్తే సంస్థ ప్రతినిధులు వచ్చి బాగుచేశారు. కానీ, మళ్లీ అదే సమస్య తలెత్తింది. ఈసారి పట్టించుకున్న నాథుడు కరవయ్యాడు. ఐఫోన్ తీసుకుంటే ఇయర్ పాడ్స్ ఉచితంగా ఇస్తామన్న ప్రకటన చూసి కాకినాడ యువకుడు ఆ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో డబ్బు చెల్లించి వస్తువు కొన్నాడు. తీరా ఇయర్ పాడ్స్ లేకుండానే ఫోన్ రావడంతో కంగుతిన్నాడు. కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ప్రయోజనం లేకపోయింది. యథేచ్ఛగా సాగుతున్న అనైతిక వ్యాపార దందాల్లో వినియోగదారుడు ఎలా దగా పడుతున్నాడన్నదానికి ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు. పైన చెప్పిన ఉదంతాల్లోని బాధితులందరూ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్లను ఆశ్రయిస్తేకానీ న్యాయం లభించలేదు. ఇలా కమిషన్లకు వస్తున్న కొన్ని కేసులను చూస్తే దేశీయంగా వినియోగదారులు ఎన్ని దారుణ నయవంచనలకు గురవుతున్నారో అర్థమవుతుంది! హైదరాబాద్‌కు చెందిన దంపతులు ఇంటి కోసం ఒక బిల్డర్ సంస్థకు డబ్బు చెల్లించారు. ఎంతకీ ఫ్లాట్ కేటాయించకుండా, డబ్బు కూడా వెనక్కివ్వకుండా ఆ కంపెనీ ముప్పుతిప్పలు పెట్టింది. ఇలాంటి స్థిరాస్తి మోసాల గురించి ఇంకా చెప్పుకోవాలంటే కొండవీటి చాంతాడంత జాబితా అవుతుంది. అనంతపురానికి చెందిన ఓ మహిళ నాలుగున్నర లక్షల రూపాయలకు పైగా వెచ్చించి తుంటి నొప్పి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అడ్డగోలు వైద్యం కారణంగా నొప్పి తగ్గకపోగా, మరింత పెరగడంతో ఆమెకు వేరే ఆస్పత్రిలో మళ్లీ ఆపరేషన్ అవసరమైంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఓ వ్యక్తి అవసరాల నిమిత్తం ఒక ఫైనాన్స్ సంస్థలో నగలు తాకట్టుపెట్టి రుణం తీసుకున్నాడు. ఆయనకు చెప్పకుండానే వాటిని వేలం చేసిన సంస్థ, రుణం పోగా మిగిలిన మొత్తం ఇదిగో అంటూ గడువు తీరిన చెక్కును అతని చేతిలో పెట్టింది. ఇది బరితెగింపు కాక మరేమిటి? ఇక కొన్ని హెల్త్, ప్రమాద బీమా సంస్థల నమ్మకద్రోహాలైతే చెప్పనలవి కావు. పూర్తి వివరాలు చెప్పకుండా ఆదరాబాదరాగా పాలసీలు అంటగడుతున్న సంస్థలు తీరా క్లెయిముల దగ్గరికి వచ్చేసరికి ఎన్నో కొర్రీలు పెడుతున్నాయి. ముందే వ్యాధుల గురించి చెప్పలేదనో, నిబంధనల పేరుతోనో క్లెయిములు తిరస్కరిస్తూ అసలే ఇక్కట్లలో ఉన్నవారిని మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. ఇంకోపక్క ఖాతాదారుల ప్రమేయం లేకుండానే అకౌంట్లు ఖాళీ అవుతున్నా, సొమ్ములు భారీగా ఇతర అకౌంట్లకు మళ్లుతున్నా మాకేం సంబంధం అన్నట్లుగా బ్యాంకులు మిన్నకుండిపోతున్నాయి. ఇక నిర్దేశిత బిల్లు కన్నా ఎక్కువ వసూలు చేయడం, చెప్పిన దానికన్నా తక్కువ స్పీడ్‌తో ఇంటర్నెట్ అందించడం, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన దానికి బదులుగా మరొకటి పంపడం, రిటర్న్‌లూ రిఫండ్‌లు సకాలంలో జరపకపోవడం... ఇలా చెప్పుకొంటూ పోతే వినియోగదారులు పడుతున్న వెతలకు అంతే ఉండదు. ఇలా 'వినియోగదారుడే రాజు' అన్నది గోడ మీద నినాదంగా మిగిలిపోతోంది. పౌరహక్కుల పట్ల యంత్రాంగంలో పేరుకుపోయిన చులకన భావాన్ని ఈ దుర్భరావస్థే పట్టిస్తోంది! అనైతిక వ్యాపార ధోరణుల నుంచి వినియోగదారులను కాపాడేందుకు కేంద్రం నాలుగు దశాబ్దాల కిందట ప్రత్యేక చట్టం తెచ్చింది. తరవాతి కాలంలో ఆన్‌లైన్ విపణి విస్తరణ నేపథ్యంలో చట్ట నిబంధనలను సవరించింది. తక్కువ ఖర్చుతో 90 నుంచి 150 రోజుల్లోగా బాధితులకు న్యాయం అందించాలన్నది ఈ చట్టం అసలు లక్ష్యం. వాస్తవంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. తాజాగా వెలువడిన ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్) ప్రకారం 2024 చివరి నాటికి జిల్లా స్థాయి వినియోగదారుల కమిషన్లలో అయిదు లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లో పడి ఉన్నాయి. రాష్ట్ర స్థాయి కమిషన్లలో గత సంవత్సరాంతానికి ప్రతి మూడు పెండింగ్ కేసుల్లో ఒకటి మూడేళ్లకు పైగా చెదలుపట్టింది. ఇక దేశవ్యాప్తంగా రాష్ట్ర కమిషన్లలో 49శాతం అధ్యక్షులు, 40శాతం సభ్యుల పోస్టులు భర్తీకి నోచుకోలేదు. జిల్లా స్థాయిలో 32శాతం అధ్యక్షులు, 39శాతం సభ్యుల పోస్టుల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. వీటి భర్తీలో జాప్యంపై సుప్రీంకోర్టు గతంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ప్రభుత్వాల్లో ఉలుకూపలుకూ ఉండటం లేదు. ఇంకోపక్క 90 జిల్లాల్లో వినియోగదారుల కమిషన్లే కరవయ్యాయి. ఒక పరిశీలన ప్రకారమైతే, మన దేశంలో ఇరవై శాతం మందికే వినియోగదారుల పరిరక్షణ చట్టంపై అవగాహన ఉంది. కమిషన్లను పటిష్ఠం చేయకుండా, చట్టం గురించి అవగాహన కల్పించకుండా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుంటే- వినియోగదారుల హక్కులకు ఇక ఎక్కడ రక్షణ లభిస్తుంది? ప్రజల సొమ్మును విచ్చలవిడిగా కాజేసేవారు

# భారత్ 'రాజీ విదేశాంగం'.. పశ్చిమాసియా సంక్షోభంలో మౌనంపై ప్రశ్నలు

అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక దేశం తన ప్రాధాన్యతలను, విలువలను, నైతిక బాధ్యతలను పక్కనపెట్టి మరొక దేశానికి లోబడి ప్రవర్తించడాన్ని 'రాజీ విదేశాంగ విధానం' అంటారు.. నేడు భారతదేశం ఆ స్థితికి చేరుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, అత్యంత ప్రాచీన నాగరికతగా, అలీన ఉద్యమానికి మూలస్తంభంగా నిలిచిన భారత్, నరేంద్ర మోడీ నాయకత్వంలో దౌత్యపరమైన బలహీనతకు, నైతిక దివాళాకు ప్రతీకగా మారింది. బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారత్ పశ్చిమాసియా సంక్షోభంలో మౌనం వహించడం భారత విదేశాంగ వైఫల్యానికి నిదర్శనమని పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.... బ్రిక్స్ అధ్యక్ష పదవి కేవలం ముసుగు మాత్రమేనా, లేక నిజమైన బాధ్యతా అనేది స్పష్టం చేయాలి. లేనిపక్షంలో, అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ మరింత దిగజారుతూనే ఉంటుంది.

### సమిష్టి ప్రకటనకూ ధైర్యం చాలట్లేదు!

కేవలం ఇరాన్ దాడులు మాత్రమే కాదు. హిందూ మహాసముద్రంలో అమెరికా నేవీ ఇరాన్ నేవీకి చెందిన యుద్ధ నౌకపై దాడి చేసింది. ఆ నౌక భారత దేశ ఆహ్వానం మేరకు ఇక్కడకు అతిధిగా వచ్చింది. అలాగే గల్ఫ్ దేశాలలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ చేస్తున్నదాడులు.. ఇవన్నీ భారత్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధించిన అంశాలే.. ఇంతటి సున్నితమైన సమయంలో సమష్టి ప్రకటన విడుదల చేయడా నికి కూడా భారత ప్రభుత్వం ధైర్యం చేయలేదు. ఎందుకు కారణం స్పష్టం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడం, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం. ఈ రాజీ వైఖరి కొత్తదేమీ కాదు.. గత వారం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ మౌనంగా ఉండిపోయారు. 'చాబహార్' ఓడరేవు అభివృద్ధి ద్వారా ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియాకు ప్రవేశ ద్వారంగా ఇరాన్ వ్యవహరిస్తోంది. కానీ అమెరికా ఒత్తిడికి లొంగిపోయి, ఇజ్రాయెల్ అనుగ్రహం కోసం ఈ సంబంధాలను బలి ఇవ్వడానికి మోడీ సిద్ధపడ్డారు.



### ప్రపంచాన్నే దూరం పెట్టారు..

జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ కాలంలో భారత్ అంతర్జాతీయ వేదికలపై గళం విప్పి, అలీన దేశాల నాయకత్వం వహించింది. విజయలక్ష్మి పండిట్ ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగాలు, కశ్మీర్ సమస్యపై భారత్ వాదన నేడు చరిత్ర పుటల్లో మిగిలిపోయాయి. నేడు మాత్రం అంతర్జాతీయ వేదికపై భారత్ స్వరం వినిపించడం లేదు. ప్రపంచంలో అత్యాచారాలు, అణచివేత, యుద్ధాలు జరుగుతున్నా భారత్ మౌనంగా ఉండిపోతోంది. ప్రధాని మోడీ తన అమెరికా, ఇజ్రాయెల్ స్నేహితుల కోసం బ్రిక్స్ అధ్యక్ష పదవి గౌరవాన్ని, బాధ్యతను, వాటి ఆదర్శాలు, లక్ష్యాలను త్యాగం చేస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి దేశంతో సమాన దూరం, సమాన సాన్నిహిత్యం అనే పంచశీల, అలీన విధాన సిద్ధాంతాన్ని విస్మరించి, కేవలం రెండు దేశాల అనుగ్రహం కోసం మిగిలిన ప్రపంచాన్ని దూరం పెట్టడం దేశ హితానికి విరుద్ధం.

### ప్రభుత్వ వైఫల్యం మాత్రమే కాదు!

పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంట్‌లో చర్చ జరిగి తీరాలి. భారత విదేశాంగ విధానం ఎటువైపు పయనిస్తోందో ప్రజలకు, ప్రతిపక్షానికి తెలియాలి. ప్రధాని మోడీ పార్లమెంటులో నిలబడి, తన విదేశాంగ విధానాన్ని వివరించాలి. ఇరాన్‌పై దాడులపట్ల మౌనంగా ఉండడానికి గల కారణాలను వివరించాలి. బ్రిక్స్ అధ్యక్ష పదవి కేవలం ముసుగు మాత్రమేనా, లేక నిజమైన బాధ్యతా అనేది స్పష్టం చేయాలి. లేని పక్షంలో, అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ మరింత దిగజారుతూనే ఉంటుంది. ప్రపంచ దేశాలు భారత్‌ను విశ్వసించడం మానేస్తాయి. ఇది కేవలం ఒక ప్రభుత్వ వైఫల్యం మాత్రమే కాదు, 140 కోట్ల భారతీయులకు అవమానం.

# యుద్ధనౌకల్లో సైనిక తిరుగుబాట్లు!

ఇజ్రాయెల్ ఒత్తిడితో ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్విన అమెరికా పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. సుదీర్ఘ కాలం యుద్ధాన్ని కొనసాగించలేక, నిలిపివేయలేక అగ్రరాజ్యం సతమతమవుతున్నది. మిత్రదేశాల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంకటాన్ని ఎదుర్కొంటున్నది. బయట నుంచి వ్యతిరేకత సంగతి అటుంచితే, ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మొదలైంది. అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌకను సొంత సైనికులే తగలబెట్టే స్థాయి ఉపద్రవం అమెరికాను ఆలోచనలో పడేసింది. అగ్రరాజ్యం, ప్రపంచ దేశాల పెద్దన్నగా పేరొంది, ఆధిపత్యంతో, సామ్రాజ్యవాద కాంక్షతో రగిలిపోయే అమెరికా పరువుపోయే పరిస్థితి వచ్చింది. అంతా నా ఇష్టం.. నేను చెప్పిందే శాసనం.. నా మనఃసాక్షికి మాత్రమే నేను జవాబుదారీ అంటూ విర్రవీగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. ఇరాన్ యుద్ధంలో పాల్గొంటున్న నౌకాదళ సైనికులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఇరాన్‌పై యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్న అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో మంటలు చెలరేగాయి. ఇది అగ్ని ప్రమాదం అని అమెరికా బయటకు చెప్తున్నది. కానీ ఈ మంటలు మామూలు మంటలు కాదని, సైనిక తిరుగుబాటు ఆగ్రహ జ్వాలలు అని విశ్వసనీయవర్గాల సమాచారం ఆధారంగా ప్రఖ్యాత మీడియా సంస్థలు కథనాలు వెలువరిస్తున్నాయి. అమెరికా నావికాదళ దర్యాప్తు సంస్థ కూడా నౌకలో జరిగిన ఘటనపై తిరుగుబాటు కోణంలో విచారణ చేపట్టింది. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కొరత ఏర్పడింది. ధరలు భారీగా పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థలు దుర్భరంగా మారాయి. దీనంతటికీ కారణమైన అమెరికా పట్ల చిరకాల మిత్రదేశాలు, గల్ఫ్ దేశాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అంతేకాకుండా అగ్రరాజ్యానికి దూరం జరుగుతున్నాయి. ఇదంతా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితి. అంతేకాకుండా ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మంటలు రగులుతున్నాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెలల తరబడి విధుల్లో ఉన్న సైనికులు విసిగివేసారిపోయారు. ఇదే సమయంలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ యుద్ధనౌకలో అగ్నికీలలు ఎగిసిపడ్డ ఘటనలో కుట్ర కోణం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. సైనికులు ఇంటికి తిరిగి రావాలనే ఆలోచనలో ఇలాంటి చర్యకు పాల్పడి ఉండారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో అగ్నికీలలు ఎగిసిపడటం సైనిక తిరుగుబాటు అనేది కేవలం పుకారు లేదా ప్రచారం ఎంతమాత్రం కాదు. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం ఉన్నట్టుగా ది న్యూయార్క్ టైమ్స్, ఫస్ట్‌పోస్ట్, గ్రీక్‌సిటీ టైమ్స్ కథనాలు ప్రచురించాయి. ఇదే విషయంపై అమెరికా నావికాదళం స్పందిస్తూ మార్చి 12న యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగినట్టుగా నిర్ధారించింది. మంటలు ముందుగా నౌక పక్క భాగంలోని లాండ్రీలో మొదలయ్యాయని పేర్కొన్నది. మంటలు 30 గంటల పాటు కొనసాగాయని, మొత్తం 600 మంది సైనికులు నివసించే గదులు దగ్ధమయ్యాయని స్పష్టంచేసింది. అదేవిధంగా దట్టమైన పొగ వల్ల ఇద్దరు సైనికులు గాయపడ్డారని వెల్లడించింది. అమెరికాకు చెందిన యుద్ధనౌకలలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కొత్తది, ఖరీదైనది. దీని విలువ సుమారు 13 బిలియన్ డాలర్లు (రూ.1.1లక్షల కోట్లు). అయితే మంటలు వ్యాపించడానికి ముందుగా గుర్తుతెలియని వ్యక్తులు వాక్యూమ్ టాయిలెట్స్‌ను టీషర్ట్స్, తాళ్లతో మూసివేసినట్టు తెలుస్తున్నది. దీంతో ప్రమాద తీవ్రత పెరిగిందని మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాల్సి వచ్చిందని వివరించింది. అమెరికా నావికాదళ నేర దర్యాప్తు సంస్థ (ఎన్‌సీఐఎస్) కుట్ర కోణంలో విచారణ చేపట్టింది. నౌకను మరమ్మతుల కోసం గ్రీక్‌కు తీసుకెళ్లాల్సి ఉన్నట్టు అమెరికా నౌకాదళ అధికారులు చెప్తున్నారు. అమెరికా సైనికులు ఇరాన్‌పై ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ సన్నాహాలు జరుగుతున్నప్పటి నుంచి పది నెలలుగా నౌకలోనే ఉన్నారు. నిరంతర ఆజ్ఞలు, హోర్ముజ్ జలసంధి వద్ద క్షిపణి ముప్పు, విధులు పొడగించడం, సెలవులు లేకపోవడంతో సైనికులు తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ తతంగమంతా వదిలేసి ఇంటికి వెళ్లిపోదామనే ఉద్దేశంతో ఉన్నట్టు వాదన వినిపిస్తున్నది. ఇదే విషయంపై ఇరాన్ ప్రసార మాధ్యమాల్లో భయపడ్డ అమెరికన్లు సొంత యుద్ధనౌకను తగలబెట్టుకున్నారు అని కథనాలు ప్రసారమవుతున్నాయి. సైనికుల తీవ్ర అలసటే ప్రధాన కారణమని అమెరికా మీడియావర్గాల్లో వాదన వినిపిస్తున్నది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం గురించి భారతీయ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఇదంతా ఎక్కడో జరుగుతున్న పరిణామాలుగా చూడనక్కరలేదు. ఏ యుద్ధం వల్లనైతే అమెరికా సైనికులు అలసిపోయారో, అదే యుద్ధం మన దేశంలో చమురు, ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ప్రభావం చూపుతుంది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఎల్పీజీలో 80-85% ఎల్పీజీ, చాలా వరకు ముడి చమురు, ఎల్ఎన్‌జీ గల్ఫ్ నుంచి హోర్ముజ్ జలసంధి మీదుగా దిగుమతి అవుతుంది. దిగుమతికి ఆటంకం ఏర్పడితే యుద్ధం ప్రభావం మన వంట గదులు, ప్రయాణాల మీద కూడా పడుతుంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభించింది. ఇరాన్ అణు ఇంధన కేంద్రాలను ధ్వంసం చేసి, ఆ దేశ నాయకత్వాన్ని తొలగించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగింది. గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లో వేలాది మంది అమెరికా సైనికులు ఉన్నారు. కానీ యుద్ధం గురించి అమెరికా తమకు సమాచారం ఇవ్వలేదని ఆయా గల్ఫ్ దేశాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. ఇదే నేపథ్యంలో ఇరాన్ జరిపిన క్షిపణి ప్రతిదాడులు గల్ఫ్ దేశాల భూభాగాలను తాకాయి. ఈ దాడుల నుంచి రక్షించుకునేందుకు గల్ఫ్ దేశాలు తమ సొంత రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాల్సి వచ్చింది. అమెరికా మాత్రం కేవలం ఇజ్రాయెల్‌ను రక్షించడంపైనే దృష్టి సారించింది. ఇప్పుడు చాలావరకు గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాయి. అమెరికా వైఖరి పట్ల ఫిర్యాదు చేస్తున్నాయి. అమెరికా తమను ఒంటరిని చేసి వదిలేసినట్టు చెప్పుకొంటున్నాయి. మరోవైపు యూరోపియన్ యూనియన్ మిత్ర దేశాలు కూడా దాడులు ఆపాలని, చర్చలు జరపాలని కోరుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మిత్రబలం క్రమంగా తగ్గుతున్నది. విమాన వాహక నౌకలు అమెరికా సైనిక శక్తికి ప్రతీకలు. వీటిలో గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ ఒక కీర్తి కిరీటం వంటిది. అణు ఇంధనంతో నడిచే ఈ యుద్ధనౌక 75 ఫైటర్ జెట్స్‌ను మోసుకెళ్తుంది. ఇందులో 5000 మంది నావికులు ఉంటారు. అమెరికా నిమిట్జ్ క్లాస్ యుద్ధనౌకలైన అబ్రహాం లింకన్, రొనాల్డ్ రీగన్ నౌకలను ఇరాన్ సమీపంలో దశాబ్దాలపాటు మోహరించింది. ఇటీవల మూడు యుద్ధనౌకలను పంపింది. తమను ఎవరూ ఏమీ చేయలేరని, ఓడించడం అసాధ్యమని బలం చాటుకోవడమే అమెరికా ఉద్దేశం. కానీ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కథనం మరో పాఠం చెప్తున్నది. యంత్రాలు ఎంత శక్తిమంతమైనవైనా, వాటిని నడిపే మనుషులు విసిగిపోతే వ్యవస్థ కుప్పకూలుతుంది. అలాగే అమెరికా సైనికులు బహిరంగంగా తిరుగుబాటు చేయకపోయినా నిశ్శబ్దంగా విధ్వంసానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. దీంతో అమెరికా రక్షణ గోడకు ఒక చిల్లు పడిందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా సైన్యంలో ఇలాంటి నిశ్శబ్ద తిరుగుబాట్లు ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా సుదీర్ఘ యుద్ధాలు జరుగుతున్నప్పుడు అగ్రరాజ్య సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి. 1960-70లలో వియత్నాం

## ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్.. ఇక బాదుడే బాదుడు.. పెట్రోల్ సెగతో టిక్కెట్ల ధరల పెంపు..



ఫ్లైట్ ఎక్కాలనుకుంటున్నారా? అయితే ఇది మీకోసమే.. ఏప్రిల్ 1 నుంచి విమాన ప్రయాణం మరింత ప్రియం కానుంది. పెరుగుతున్న ఇంధన ధరలు, అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విమానయాన సంస్థలు భారీగా సర్‌ఛార్జీలు వడ్డించేందుకు సిద్ధమయ్యాయి. ఇంధన ధరల సెగపై కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు ఏమన్నారు..? తెలుసుకుందాం.. సామాన్య విమాన ప్రయాణికులకు ఇదొక చేదువార్త అని చెప్పొచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల ప్రభావం నేరుగా విమాన టిక్కెట్లపై పడే అవకాశం ఉంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల పెరుగుదల కారణంగా ఏప్రిల్ 1 నుండి విమానయాన సంస్థలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కోవచ్చని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు అన్నారు. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంధన ధరలను సవరిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1న జరగబోయే ధరల నిర్ణయం విమానయాన రంగానికి కీలకం కానుంది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ఇది నేరుగా విమాన ఇంధన ధరల పెరుగుదలకు దారితీస్తోంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో దాదాపు 35 నుండి 45 శాతం వాటా కేవలం ఇంధనానిదే ఉంటుంది. అందుకే ఇంధన ధరలు పెరిగితే ఆ భారం నేరుగా టిక్కెట్ ధరలపై పడుతుంది. ఇప్పటికే ప్రధాన విమానయాన సంస్థలు తమ ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఫ్యూయల్ సర్‌ఛార్జ్ పేరుతో అదనపు బాదుడును మొదలుపెట్టాయి. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ దేశీయ టిక్కెట్లపై రూ.399, అంతర్జాతీయ మార్గాల్లో గమ్యస్థానాన్ని బట్టి రూ.830 నుండి రూ. 16,600 వరకు అదనపు వసూళ్లు చేసే అవకాశం ఉంది. ఇండిగో దూరాన్ని బట్టి ఒక్కో సెక్టార్‌కు రూ. 425 నుండి రూ. 2,300 వరకు సర్‌ఛార్జ్ విధిస్తోంది. అకాసా ఎయిర్ప్రయాణ సమయాన్ని బట్టి రూ. 199 నుండి రూ.1,300 వరకు అదనపు ఛార్జీలు వేస్తుంది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, ప్రయాణికులపై భారం తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది కేవలం పౌర విమానయాన శాఖకు మాత్రమే పరిమితమైన అంశం కాదని, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖలతో కలిసి సమన్వయంతో పరిష్కారం వెతకాల్సి ఉందని మంత్రి రామ్ మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్న గగనతలాలను వదిలి, విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో ఇంధన వినియోగం మరింత పెరుగుతోంది. ఈ సవాళ్లను అధిగమిస్తూనే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రాధాన్యతని ఆయన తెలిపారు. ఏప్రిల్ 1 తర్వాత విమాన టిక్కెట్ల ధరలు ఏ మేరకు పెరుగుతాయనేది ఇంధన కంపెనీలు ప్రకటించే ధరలపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రయాణికులకు ఎంతవరకు ఊరటనిస్తాయో వేచి చూడాలి.

## యుద్ధం మేఘాల నడుమ భారత్‌కు బిగ్ రిలీఫ్.. వేలాది టన్నుల ఎల్పీజీతో మంగళూరు పోర్టుకు నౌక..!



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా, ఆసియా దేశాలు తీవ్రమైన గ్యాస్, చమురు కొరతను ఎదుర్కొంటున్నాయి. భారతదేశం కూడా ఎల్‌పిజి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అయితే, ఒక ఊరట కలిగించే వార్త వెలువడింది: ఎల్‌పిజి గ్యాస్‌తో 'పైక్సిస్ పయనీర్' అనే షిప్ ఆదివారం (మార్చి 22న) భారతదేశానికి చేరుకుంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా, ఆసియా దేశాలు తీవ్రమైన గ్యాస్, చమురు కొరతను ఎదుర్కొంటున్నాయి. భారతదేశం కూడా ఎల్‌పిజి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అయితే, ఒక ఊరట కలిగించే వార్త వెలువడింది: ఎల్‌పిజి గ్యాస్‌తో 'పైక్సిస్ పయనీర్' అనే షిప్ ఆదివారం (మార్చి 22న) భారతదేశానికి చేరుకుంది. వచ్చే వారం న్యూ మంగళూరు పోర్టుకు భారీ పరిమాణంలో ఎల్పీజీ రానుంది. మొత్తం సుమారు 72,700 టన్నుల ఎల్పీజీ రానుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వార్తలు వస్తున్నాయి. 16,714 టన్నుల ఎల్‌పిజితో మొదటి ట్యాంకర్ ఆదివారం వచ్చింది. సింగపూర్ జెండా కలిగిన 'పైక్సిస్ పయనీర్' అనే ఈ ట్యాంకర్ స్థూల డెడ్‌వెయిట్ 47,236 టన్నులు. ఈ నౌక ఫిబ్రవరి 14న పోర్ట్ ఆఫ్ నెదర్లాండ్ నుండి బయలుదేరి, ఏజిస్ లాజిస్టిక్స్ లిమిటెడ్ కోసం ఎల్‌పిజిని అన్‌లోడ్ చేస్తుంది. ఆ తర్వాత అది సోమవారం ఉదయం బయలుదేరుతుంది.

### వీడియో ఇక్కడ చూడండి..

దీని తరువాత, అపోలో ఓషన్ అనే ట్యాంకర్ కూడా మార్చి 25న పోర్టుకు రానుంది. ఇది 26,687 టన్నుల ఎల్‌పిజిని తీసుకువస్తుంది. ఈ గ్యాస్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కోసం అన్‌లోడ్ చేస్తారు. వియత్నాం జెండాను కలిగి ఉన్న ఈ నౌక గుజరాత్‌లోని వడినార్ పోర్టు నుండి వస్తుంది. వాస్తవానికి 26,000 టన్నుల ఎల్‌పిజితో మార్చి 18న మంగళూరుకు చేరుకోవాల్సి ఉన్న శివాలిక్ అనే మరో ట్యాంకర్, వడినార్ పోర్టులో తన సరుకును అపోలో ఓషన్‌కు అప్పగించింది. అదనంగా, మార్చి 29న, సుమారు 30,000 టన్నుల ఎల్‌పిజిని తీసుకువచ్చే మరో ట్యాంకర్ అమెరికా నుండి రానుంది. ఈ గ్యాస్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఉద్దేశించినది. మంగళూరులోని హెచ్‌పిసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్ ఈ గ్యాస్‌ను స్థానిక బాట్లింగ్ ప్లాంట్‌లకు ప్రాసెస్ చేసి, బెంగళూరుతో సహా ఇతర గమ్యస్థానాలకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంది. అందువల్ల, రాబోయే రోజుల్లో న్యూ మంగళూరు పోర్టుకు భారీ ఎల్‌పిజి రవాణా రాకతో గ్యాస్ సరఫరా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

## జీతం తీసుకునేవారికి బ్యాడ్ న్యూస్.. ఏప్రిల్ నుంచి కేంద్రం కొత్త రూల్స్.. తగ్గనున్న టేక్ హోం శాలరీ..



ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. దీంతో కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ నియమావళి వర్తింపచేయనున్నారు. దీంతో పాటు కొత్త లేబర్ కోడ్స్ వల్ల జీతాలు పొందేవారికిపై ప్రభావం చూపనుంది. టేక్ హోం శాలరీ తగ్గి పీఎఫ్ కాంట్రిబ్యూషన్ పెరగనుంది. ఏప్రిల్ 1 రావడానికి మరో తొమ్మిది రోజుల సమయమే మిగిలి ఉంది. ఆ రోజు నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం అమల్లోకి రానుంది. దీంతో దేశ ప్రజలను ప్రభావితం చూసే అనేక కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. వీటి గురించి దేశంలోని ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరముంది. జీతాలు పొందేవారితో పాటు ఈపీఎఫ్ ఖాతా ఉన్నవారిని ప్రభావితం చేసే అనేక మార్పులు జరగనున్నాయి. జీతం పొందేవారికి టేక్ హోం శాలరీ తగ్గనుండగా.. పీఎఫ్ కాంట్రిబ్యూషన్ పెరగనుంది. కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్, కొత్త లేబర్ కోడ్స్‌తో అనేక మార్పులు రానున్నాయి. మీరు నెలనెలా జీతం పొందుతుంటే.. మీపై ఎలాంటి ప్రభావం చూపనున్నాయనేది చూద్దాం.

### తగ్గనున్న టేక్ హోం శాలరీ

కేంద్ర కొత్త వేతన నిబంధనలు తీసుకొస్తోంది. ఈ నిబంధనల ప్రకారం బేసిక్ శాలరీ అనేది మొత్తం సీటీసీలో కనీసం 50 శాతం తప్పనిసరిగా ఉండాలి. దీని వల్ల బేసిక్ శాలరీ పెరిగితే.. మీ పీఎఫ్ నెలవారీ చందా కూడా పెరుగుతోంది. దీని వల్ల టేక్ హోమ్ శాలరీ తగ్గి పీఎఫ్ కాంట్రిబ్యూషన్ అనేది పెరుగుతోంది. దీని వల్ల దీర్ఘకాలంలో పీఎఫ్ అకౌంట్ ద్వారా మీ సేవింగ్స్ పెరుగుతాయి. రిటైర్మెంట్ సమయానికి మీ అకౌంట్లో నగదు ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీకు ఆర్థిక భరోసా అనేది ఉంటుంది.

### లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌పై పన్ను మినహాయింపు

ఇక లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌పై పన్ను మినహాయింపు పరిమితిని పెంచుతూ ఊరటనిచ్చింది. మీరు ప్రైవేట్ ఉద్యోగులు అయితే పన్ను మినహాయింపులు పొందవచ్చు. బేసిస్ శాలరీ, అలవెన్సులు, పన్ను కోతలు అన్నీ కొత్త నిబంధనల ఆధారంగా మారిపోతాయి. మీరు దీర్ఘకాలంలో పన్ను ఆదా చేసుకోవడానికి కొత్త రూల్స్ ఉపయోగపడతాయి.

కొత్త పన్ను విధానం

ఇక పన్ను విధానంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. పాతన పన్ను విధానంలో మీరు ఎంచుకున్నట్లయితే.. ఆటోమేటిక్‌గా కొత్త ట్యాక్స్ రెజిమీలోకి మారతారు. కొత్త పన్ను విధానంలోనే మీ ట్యాక్సులు లెక్కిస్తారు. దీని వల్ల మీకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు ఉండవు. అయితే పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం వల్ల ఉద్యోగులకు ఊరట లభించనుందని చెప్పవచ్చు. ఏప్రిల్ 1 నంచి ఈ రూల్స్ అన్నీ వర్తింపచేయనున్నారు. దీంతో జీతం తీసుకునేవారు, ట్యాక్సులు చెల్లించేవారి విషయంలో మార్పులు జరగనున్నాయని చెప్పవచ్చు. కేంద్రం గత నవంబర్‌లో కొత్త కార్మిక కోడ్స్‌ను తీసుకొచ్చింది. వీటి ఆధారంగా చాలా మర్పులు రాబోతున్నాయి. ఈ మార్పులతో ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అనేవి ఎక్కువగా ఉండనున్నాయని చెప్పవచ్చు.

## గ్యాస్ సిలిండర్‌తో పనిలేదు.. జస్ట్ ఈ ఒక్కటి మీ ఇంట్లో ఉంటే చాలు.. వంటకు ఢోకాలేనట్టే!











ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో చాలా దేశాల్లో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. మన భారత దేశంలో సైతం ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. ఈ క్రమంలో చాలా మంది గ్యాస్‌కు లేకుండా వంటచేసుకునే ఉపరకణాల కోసం వెతుకుతున్నారు. అలాంటి వారికి ఇప్పుడు మేం చెప్పబోయే ఈ ప్రొడెక్ట్ మంచి ఎంపిక అవుతుంది. గ్యాస్ లేకుండానే దీనిపై క్షణాల్లో ఫ్రైవంటి ఆహారాలు వండుకోవచ్చు. అదెంటో తెలుసుకుందాం పదండి.

దేశంలో గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో అందరూ వాటికి ప్రత్యమ్నాయంగా ఇండక్షన్ స్టవ్‌లను కొంటున్నారు.దీంతో మార్కెట్‌లో వాటి స్టాక్ మొత్తం అయిపోయింది. ఎక్కడ చూసినా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. అలాంటి వారికి ఎలక్ట్రిక్ స్మార్ట్ ఎయిర్ ఫ్రైయర్ ఓ మంచి ఎంపిక దీనిలో మీరు గ్యాస్ లేకుండానే వంట చేసుకోవచ్చు. దీనిలో దాదాపు 33 రకాల వంటలను చేసుకోవచ్చు.

**1 / 5**

ఎయిర్‌ఫ్రైయర్‌లో ఏ వంటకాలు చేసుకోవచ్చు: ఈ ఎలక్ట్రిక్ ఎయిర్ ఫ్రైయర్‌లో మీరు 33 రకాల వంటలను చేసుకోవచ్చు. వాటిలో త్వరగా వేయించే వంటలు, నీటిలో ఉడికించే వంటలు, ఆవిరితో వంట, కేకులు, బేకింగ్ వంటలు ఇలా ఇంకా అనేక రకాల వంటలు చేసేందు ఇందులో సపరేట్ మోడ్స్ ఉన్నాయి. ఇలా రోజువారీ వంటల నుండి ప్రత్యేక వంటకాల అన్నింటిని దీనిలో క్షణాల్లో వండుకోవచ్చు.

**2 / 5**

ఈ స్మార్ట్ కుక్కర్‌లో అంబిట్ హీట్ అనే ప్రత్యేక టెక్నాలజీని ఉపయోగించారు. దీనిలో ఉండే సెన్సర్లు వంట సమయంలో ఉష్ణోగ్రతను ఆటోమేటిక్‌గా నియంత్రిస్తాయి. దీని వల్ల కూరగాయలు సరిగ్గా ఉడుకుతాయి. అలాగే రుచి, టెక్స్చర్ కూడా సూపర్‌గా వస్తుంది. మీకు వంట చేయడంలో ఎలాంటి అనుభవం లేకపోయినా పెద్ద ఇబ్బంది ఉండదు.

**3 / 5**

ఈ కుక్కర్ మీకు 6 లీటర్ల కెపాసిటీతో వస్తుంది. దీని ద్వారా మీరు ఒకేసారి ఐదు మందికి సరిపడే భోజనం తయారు చేయవచ్చు. ఇది ముఖ్యంగా చిన్న కుటుంబాలకు, బ్యాచులర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే దీనిలో స్లీక్ మ్యాట్ ఫినిష్ డిజైన్ ఉంటుంది. ఇది మీ వంటగదికి మంచి స్టైలిష్ లుక్‌ను ఇస్తుంది.

**4 / 5**

ప్రస్తుతం నెలకొన్ని గ్యాస్ కొరత కారణంగా సిలిండర్ దొరకడం చాలా ఇబ్బందిగా మారింది. ఇలాంటి సందర్భాల్లో ఈ కుక్కర్ మీకు చాలా బాగా సహాయపడుతుంది. ఎందుకంటే దీంతో గ్యాస్ అవసరం లేకుండా విద్యుత్‌లోనే వంట చేయవచ్చు. ఇది ప్రస్తుతం అమెజాన్, ఫ్లిఫ్‌కార్ట్ లేదా బయట షాప్‌లో ఈజీగా దొరకుతుంది.

## పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ.. ఎప్పటికీ ఫెయిల్ అవ్వని తెరుగులేని బిజినెస్‌లు ఇవే!












చిన్నదో, పెద్దదో ఏదో ఒక బిజినెస్ పెట్టుకోవాలని చాలా మంది అనుకుంటారు. కానీ ఏ బిజినెస్ పెట్టాలి, ఎలాంటి బిజినెస్‌కు మంచి మార్కెట్ ఉందో చాలా మందికి తెలియదు. మనం వ్యాపారంలో విజయం సాధించాలంటే, కేవలం తెలివితేటలు మాత్రమే సరిపోవు, మనం ఏ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నాం అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి ఎలాంటి వ్యాపారాలు చేయడం వల్ల మనం మంచి లాభాలు పొందవచ్చో తెలుసుకుందాం.

మన బిజినెస్‌లో భాగా రాణించాలి అనుకుంటే మొదట మన చిత్ర గురించి తెలుసుకోవడం ముఖ్యం. గత కొన్నేళ్లు మన దేశంలో తిరుగులేని వ్యాపారాల్లో ఆహారం, విద్య, నిత్యావసర వస్తువులు, ఆరోగ్యం అగ్రగామికి నిలుస్తున్నాయి. ఈ రంగాలు మానవ మనుగడకు ఎంతో కీలకం. కాబట్టి మీరు ఇలాంటి వాటిపై పెట్టుబడి పెడితే, మీకు ఖచ్చితంగా లాభం వస్తుంది.

**1 / 5**

ఫుడ్, గ్రోసరీస్: ప్రతి ఒక్కరికి ఆహారం ఒక ప్రాథమిక అవసరం కాబట్టి, ఈ వ్యాపారం ఎప్పటికీ విఫలం కాదు. టిఫిన్ సెంటర్, ఫుడ్ హోమ్ డెలివరీ లేదా ఒక చిన్న హోటల్ వంటివి ఇతర వ్యాపారాల కంటే 5 రెట్లు అధిక లాభాలతో మంచి ఆదాయాన్ని అందిస్తాయి. అలాగే నిత్యావసర వస్తువుల దుఖానాలు ఇవి కూడా మన రోజువారి లైఫ్‌లో ఎంతో ముఖ్యం. అందుకే పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లు వచ్చినా కూడా, సామాన్యుడి మొదటి ఎంపిక దగ్గరలోని కిరాణా దుకాణమే అవుతుంది. కాబట్టి ఇవి కూడా మంచి లాభాలను తెచ్చిపెడతాయి.

**2 / 5**

విద్యా, వైద్యం: భారతదేశంలో వేంగంగా ఎదుగుతున్న రంగాల్లో విద్యా, వైద్యం కూడా టాప్‌లో ఉన్నాయి. ట్యూటరింగ్ క్లాస్, కోచింగ్ సెంటర్ లేదా ఆన్‌లైన్ కోచింట్ సెంటర్ ప్రారంభించడం ద్వారా మీరు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మీరు కోచింగ్ ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని గడించవచ్చు. అలాగే ఆరోగ్యం, మానవుడు సురక్షితంగా జీవించాలంటే వైద్యం ముఖ్యం. ఆసుపత్రుల సమీపంలో లేదా రద్దీగా ఉండే ప్రాంతంలో ఫార్మసీని ప్రారంభించడం ద్వారా స్థిరమైన ఆదాయం లభిస్తుంది. మీరు జెనరిక్ మందులను అమ్మడం ద్వారా లాభం పొందవచ్చు.

**3 / 5**

అద్దె భవనాలు: ప్రస్తతం పెరుగుతన్న వలసల నేపథ్యంలో ప్రధాన నగరాల్లో ఇళ్లు, ఆఫీస్‌లకు డిమాండ్ బాగా పెరుగుతోంది. మీ దగ్గర డబ్బులు ఉంటే ఒక ఖాళీ స్థలం తీసుకోని దానిలో ఒక బిల్డింగ్ నిర్మించి వాటిని రెంట్‌కు ఇవ్వండి. మీరు ఇళ్లను అద్దెకు ఇవ్వడం ద్వారా లేదా ప్రాపర్టీ కన్సల్టెంట్‌గా పనిచేయడం ద్వారా పెద్దగా శ్రమపడకుండా స్థిరమైన ఆదాయాన్ని సంపాదించవచ్చు.

**4 / 5**

ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్: ఆన్‌లైన్ చెల్లింపులు, హోమ్ డెలివరీ వంటి సౌకర్యాలను అందించడం ద్వారా కూడా మీరు ఆదాయాన్ని పొందవచ్చు. ఏవైనా ఈ కామర్స్ ప్లాట్‌మామ్స్‌లోని వస్తువులను హోట్ డెలివరీ చేస్తూ మీరు ఆదాయం గడించవచ్చు. మీరు ఏ వ్యాపారం ప్రారంభించినా, ముందుగా స్థానిక మార్కెట్ అవసరాలను తెలుసుకోండి.

## ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేవారికి బిగ్ అలర్ట్.. దేశంలో మారనున్న రూల్స్.. మరికొద్ది రోజులే టైమ్




సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఆన్ లైన్ ట్రాన్సాక్షన్లకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేశారు. ఇక నుంచి ఆన్ లైన్ లావాదేవీలు చేయాలంటే రెండు రకాల వెరిఫికేషన్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మరింత భద్రతను కల్పించేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల సైబర్ మోసాలు పెరుగుతున్న క్రమంలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ కొత్త రూల్స్‌తో మీరు మరింత సురక్షితంగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్ లైన్ ట్రాన్సాక్షన్లు పూర్తిగా మారనున్నాయి. ప్రతీఒక్కరినీ ప్రభావితం చేయనున్న ఈ రూల్స్ గురించి దేశ ప్రజలందరూ తెలుసుకోవాల్సిందే. ఇంతకు ఆన్ లైన్ లావాదేవీలకు ఏప్రిల్ నుంచి వస్తున్న కొత్త నియమాలు ఏంటి..? అనే వివరాలు చూద్దాం.

### టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్

ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్ లైన్ చెల్లింపులకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరి చేస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో అతిపెద్ద మార్పు రాబోతుంది. అదేంటంటే.. మీరు ఏదైనా డిజిటల్ లావాదేవీ చేయాలంటే ఏదైనా రెండు రకాల ధృవీకరణ ప్రక్రియలు పూర్తి చేయాలి. ఈ మేరకు బ్యాంకులు, కార్డ్ నెట్‌వర్క్‌లు, ఫిన్‌టెక్ సంస్థలకు ఆర్బీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. పాస్ వర్డ్, పాస్ ఫ్రేజ్‌లు లేదా పిన్‌లు, హార్డ్‌వేర్ టోకెన్, కార్డులు లేదా సాఫ్ట్‌వేర్ ఆధారిత వెరిఫికేషన్ టోకెన్లు, ఫింగర్‌ప్రింట్స్, ఫేషియల్ రికగ్నేషన్ వంటి రెండు రకాల వెరిఫికేషన్లు పూర్తి చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది.

### నిబంధనలు ఇవే..

అన్ని డిజిటల్ చెల్లింపులకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరి

రెండిటిలో ఒకటి డైనమిక్‌గా ఉండాలి.. మరొకటి ప్రత్యేకంగా రూపొందించాలి

నిబంధనలు పాటించకపోవడం వల్ల మోసం జరిగితే బాధ్యత వహించాలి

రిస్క్ బేస్డ్ లావాదేవీలకు అథెంటికేషన్‌కు ప్రత్యేక తనిఖీలు అవసరం

అక్టోబర్ 1,2026 నుంచి క్రాస్ బార్డర్ లావాదేవీలకు కూడా అథెంటికేషన్ అవసరం

### ఆర్బీఐ కొత్త రూల్స్ ఎందుకు..?

గత కొన్నేళ్లుగా యూపీఐ రాకతో డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. దీని వల్ల సైబర్ మోసాలు, అనధికార లావాదేవీల్లో కూడా పెరుగుదల నమోదైంది. సిమ్ స్వాప్‌లు, ఫిషింగ్, మాల్వేర్ దాడులకు సులభంగా గురయ్యే ఓటీపీలపై ఆధారపడకుండా ఈ కొత్త ఫ్రేమ్ వర్క్ బహుళ అంచెల భద్రతను కల్పిస్తుంది. ఇక ఈ టూ ఫ్యాక్టర్ వెరఫికేషన్ నియమాలను పాటించకపోవడం వల్ల ఒక లావాదేవీ మోసపూరితమైనదైతే బ్యాంకులు కస్టమర్లకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి. లావాదేవీలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడం, ప్రతి దశలోనూ నిబంధనల పాటింపును నిర్ధారించుకోవడం కోసం ఈ నిబంధనలను ఆర్బీఐ ప్రవేశపెట్టింది. అన్ని ఆర్థిక సంస్థలు ఈ నిబంధనలను పాటించాలని ఆర్బీఐ ఆదేశించింది.

## పీఎస్ఎల్ అంటేనే భయం.. ఐపీఎల్ అంటేనే ప్రాణం..

# పాకిస్థాన్‌కు విదేశీ ప్లేయర్లు షాక్

ఐపీఎల్ 2026 ప్రభావంతో పీఎస్ఎల్ 11వ సీజన్ నుంచి 8 మంది విదేశీ ఆటగాళ్లు తప్పుకున్నారు. పీసీబీ చైర్మన్ లీగల్ యాక్షన్ హెచ్చరికలు జారీ చేసినా ప్లేయర్లు వెనక్కి తగ్గడం లేదు. వ్యక్తిగత కారణాలతో ఏకంగా 8 మంది స్టార్ విదేశీ ప్లేయర్లు లీగ్ నుంచి తప్పుకోవడం పాకిస్థాన్ క్రికెట్‌కు పెద్ద అవమానంగా మారింది.




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆశలపై నీళ్లు చల్లుతూ పాకిస్థాన్ సూపర్ లీగ్ (గూూ 2026) ప్రారంభానికి ముందే విదేశీ ఆటగాళ్లు వరుసగా హ్యాండిస్తున్నారు. మార్చి 26న పీఎస్ఎల్ 11వ సీజన్ ప్రారంభం కానుండగా.. కేవలం రెండు రోజుల వ్యవధిలో అంటే మార్చి 28న ఐపీఎల్ 19వ సీజన్ మొదలవుతోంది. ఈ నేపథ్యంలో మెరుగైన ఆఫర్లు, వ్యక్తిగత కారణాలతో ఏకంగా 8 మంది స్టార్ విదేశీ ప్లేయర్లు లీగ్ నుంచి తప్పుకోవడం పాకిస్థాన్ క్రికెట్‌కు పెద్ద అవమానంగా మారింది. ఐపీఎల్‌తో పోటీ పడాలనుకున్న పీసీబీకి ఇప్పుడు ఉన్న ఆటగాళ్లను కాపాడుకోవడమే గగనమైపోతోంది.

పీఎస్ఎల్ వదిలేసిన ఆ 8 మంది వీరులు వీరే

పీఎస్ఎల్ 11వ సీజన్ నుంచి తప్పుకున్న వారిలో అత్యంత కీలకమైన పేరు ఆస్ట్రేలియా యువ సంచలనం జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్. రావల్పిండి పిండీస్ తరపున ఆడాల్సిన ఆయన వ్యక్తిగత కారణాలంటూ తప్పుకున్నారు. అలాగే క్వెట్టా గ్లాడియేటర్స్ స్టార్ స్పెన్సర్ జాన్సన్ కూడా లీగ్‌కు నో చెప్పారు. వెస్టిండీస్ ఆటగాళ్లు జాన్సన్ చార్లెస్, గుడాకేష్ మోటి కూడా పీఎస్ఎల్ నుంచి వైదొలిగారు. వీరే కాకుండా ఇంగ్లాండ్ పేసర్ టైమల్ మిల్స్, జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ ముజారబానీ, అఫ్ఘనిస్తాన్ స్టార్ రహ్మానుల్లా గుర్బాజ్, సౌతాఫ్రికాకు చెందిన ఒట్నీల్ బార్ట్‌మన్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

ఐపీఎల్ ఆఫర్లే ప్రధాన కారణమా

ఆటగాళ్లు పీఎస్ఎల్ వదిలేయడానికి ప్రధాన కారణం ఐపీఎల్ 2026. పీఎస్ఎల్ లో ఇచ్చే రెమ్యూనరేషన్ కంటే ఐపీఎల్ లో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా వెళ్లినా భారీగా డబ్బు వస్తుంది. ఉదాహరణకు, బ్లెస్సింగ్ ముజారబానీ కేకేఆర్ లో చేరగా, దాసున్ షనక రాజస్థాన్ రాయల్స్ పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు. ఐపీఎల్ ఫ్రాంచైజీల నుండి పిలుపు రావడంతో చాలా మంది ఆటగాళ్లు పీఎస్ఎల్ ఒప్పందాలను పక్కన పెట్టేస్తున్నారు. దీనివల్ల పీఎస్ఎల్ లో స్టార్ పవర్ తగ్గిపోతోందని పాక్ క్రికెట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ సీరియస్

ఆటగాళ్లు ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంపై పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి ఐపీఎల్ వైపు వెళ్తున్న ఆటగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గతంలో కోర్బిన్ బాష్ అనే ఆటగాడిపై తీసుకున్న చర్యలనే ఇప్పుడు కూడా అమలు చేస్తామని చెప్పారు. అయితే, ఆటగాళ్లు మాత్రం పీసీబీ బెదిరింపులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పాకిస్థాన్-అఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కూడా విదేశీ ప్లేయర్ల భయాందోళనలకు ఒక కారణమని సమాచారం.

ఖైదీల్లాంటి భద్రత.. స్టేడియాల్లో ఫ్యాన్స్ లేరు

మరోవైపు, పీఎస్ఎల్ 2026 మ్యాచ్‌లను క్లోజ్డ్ డోర్స్ (ప్రేక్షకులు లేకుండా) నిర్వహించాలని పీసీబీ భావిస్తోంది. దేశంలో నెలకొన్న ఇంధన సంక్షోభం, భద్రతా కారణాల దృష్ట్యా కేవలం కరాచీ, లాహోర్ వేదికలకే మ్యాచ్‌లను పరిమితం చేశారు. ఆటగాళ్లకు దేశాధినేతలకు ఇచ్చే స్థాయి భద్రత కల్పిస్తామని చెబుతున్నా.. విదేశీ ప్లేయర్లు మాత్రం పాకిస్థాన్ వెళ్లడానికి మొగ్గు చూపడం లేదు. ఒకవైపు ఐపీఎల్ గ్లామర్, మరోవైపు పాక్ లోని అస్థిర పరిస్థితుల మధ్య పీఎస్ఎల్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

## ఆరో ట్రోఫీ మనదే.. ముంబై ఇండియన్స్

# అభిమానులకుప్రామిస్ చేసిన హిట్ మ్యాన్

ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2026 ప్రయాణం మార్చి 29న మొదలవుతుంది. ఆరో ట్రోఫీ గెలుస్తామని రోహిత్ శర్మ ఫ్యాన్స్‌కు ప్రామిస్ చేశాడు. శనివారం రాత్రి ముంబై ఇండియన్స్ జట్టు తమ ఆటగాళ్లు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్ కోసం ద మిక్స్ పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.




ఐపీఎల్ 2026 రణరంగం మొదలవ్వడానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఈసారి ఎలాగైనా ఆరో ట్రోఫీని ముద్దాడాలనే కసితో ఉంది. మార్చి 29న వాంఖడే స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడటం ద్వారా ముంబై తన ప్రయాణాన్ని మొదలుపెట్టనుంది. ఈ మెగా టోర్నీ ప్రారంభానికి ముందు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ తమ ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా ద మిక్స్ అనే బాండింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ఫ్యాన్స్‌కు అదిరిపోయే ప్రామిస్ చేశాడు. ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్‌లో శనివారం రాత్రి ముంబై ఇండియన్స్ జట్టు తమ ఆటగాళ్లు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్ కోసం ద మిక్స్ పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు రోహిత్ శర్మ తన గారాల పట్టి సమైరాతో కలిసి రాగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా తన గర్ల్ ఫ్రెండ్ మాహికా శర్మతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా రోహిత్ శర్మ అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మేమంతా కలిసి ఈసారి ఆరో ట్రోఫీని ముంబైకి తీసుకురావడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం" అని మాటిచ్చాడు. రోహిత్ నోట ఈ మాట రావడంతో ఎంఐ ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ముంబై ఇండియన్స్ జట్టుకు గత కొన్ని ఏళ్లుగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. 2020లో ఐదోసారి ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత ఆ జట్టు కనీసం ఫైనల్‌కు కూడా చేరలేకపోయింది. ముఖ్యంగా 2024 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచి అభిమానులను నిరాశపరిచింది. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీపై గతంలో విమర్శలు వచ్చినప్పటికీ, ఈసారి జట్టులో గట్టి బాండింగ్ కనిపిస్తోంది. సీనియర్ ఆటగాళు ్లు, యువ రక్తం కలిసి జట్టును విజయపథంలో నడిపించాలని కృత నిశ్చయంతో ఉన్నారు. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ లైనప్ చూస్తుంటే ప్రత్యర్థి బౌలర్లకు వణుకు పుట్టడం ఖాయం. రోహిత్ శర్మతో పాటు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫినిషర్లుగా ఉన్నారు. వీరితో పాటు క్వింటన్ డికాక్, రేయాన్ రికెల్టన్ వంటి విధ్వంసకర విదేశీ ఆటగాళ్లు తోడవ్వడంతో ముంబై బ్యాటింగ్ లైనప్ అత్యంత బలంగా కనిపిస్తోంది. బౌలింగ్‌లో కూడా బుమ్రా వంటి యోధుడు ఉండటం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడుతుంది. సొంత మైదానం వాంఖడేలో ఈ మ్యాచ్ జరగనుండటంతో అభిమానుల సపోర్ట్ జట్టుకు పుష్కలంగా లభించనుంది. ప్రాక్టీస్ సెషన్లలో రోహిత్ శర్మ పాత రోజులను గుర్తు చేస్తూ భారీ షాట్లు ఆడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రోహిత్ అన్న ప్రామిస్ ప్రకారం ఈసారి ముంబై ఆరో టైటిల్ గెలిచి చరిత్ర సృష్టిస్తుందో లేదో చూడాలి.

# ఐపీఎల్‌లో హ్యాట్రిక్ మ్యాజిక్- 19ఏళ్లలో ఆ ముగ్గురు బౌలర్ల రికార్డులే వేరు!

ఐపీఎల్ చరిత్రలో తొలి హ్యాట్రిక్ వీరుడిగా లక్ష్మీపతి బాలాజీ- మూడు హ్యాట్రిక్కులతో ఎవరికీ అందని రికార్డు సృష్టించిన సీనియర్ స్పిన్నర్- ఒకే సీజన్‌లో రెండు హ్యాట్రిక్కులు తీసిన ఏకైక ఆటగాడు అతనే




క్రికెట్‌లో బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతుంటే బౌలర్లు తమదైన వ్యూహాలతో చెక్ పెడుతుంటారు. అయితే కేవలం మూడు బంతుల్లోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసే 'హ్యాట్రిక్' మ్యాజిక్ మాత్రం ఎప్పుడూ ఒక ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. ఐపీఎల్ 19 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటివరకు మొత్తం 23 సార్లు ఈ అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. 2008లో మొదలైన ఈ లీగ్ లో ఎందరో దిగ్గజ బౌలర్లు తమ స్పిన్, స్పీడ్ తో బ్యాటర్లను బోల్తా కొట్టించి హ్యాట్రిక్ క్లబ్ లో చేరారు. పరుగుల వరద పారే ఈ లీగ్ లో బౌలర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్న ఆ అద్భుత హ్యాట్రిక్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

తొలి హ్యాట్రిక్ రికార్డు

ఐపీఎల్ చరిత్రలో మొట్టమొదటి హ్యాట్రిక్ నమోదు చేసిన ఘనత లక్ష్మీపతి బాలాజీకి దక్కుతుంది. 2008లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతూ పంజాబ్ కింగ్స్ పై ఆయన ఈ రికార్డ్ అందుకున్నారు. ఆఖరి ఓవర్ లో పంజాబ్ గెలవడానికి 19 పరుగులు కావాల్సిన సమయంలో, వరుసగా ఇర్ఫాన్ పఠాన్, పీయూష్ చావ్లా, విఆర్వీ సింగ్ లను అవుట్ చేసి బాలాజీ హ్యాట్రిక్ పూర్తి చేశారు. అదే మ్యాచ్ లో ఐదు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్ గా నిలవడం విశేషం. చెన్నై గడ్డపై జరిగిన ఈ అద్భుతం ఇప్పటికీ అభిమానుల గుండెల్లో నిలిచిపోయింది.

అమిత్ మిశ్రా అరుదైన ఫీట్- మూడు సార్లు హ్యాట్రిక్

ఐపీఎల్ హ్యాట్రిక్ ల జాబితాను ఒకసారి గమనిస్తే లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా పేరు అగ్రస్థానంలో కనిపిస్తుంది. అతను తన కెరీర్ లో ఏకంగా మూడు సార్లు హ్యాట్రిక్కులు సాధించి ఎవరికీ అందని రికార్డును అందుకున్నారు. విశేషం ఏమిటంటే, ఈ మూడు హ్యాట్రిక్కులను మూడు వేర్వేరు జట్ల తరపున (ఢిల్లీ క్యాపిటల్స్, డెక్కన్ చార్జర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్) సాధించారు. బ్యాటర్లను బురిడీ కొట్టించడంలో మిశ్రా చూపించిన ఆ స్పిన్ మ్యాజిక్ ఐపీఎల్ లోనే టాప్ హైలైట్స్ అని చెప్పవచ్చు.

యువరాజ్ సింగ్ రికార్డు- ఒకే సీజన్ లో రెండు సార్లు

భారత మాజీ స్టార్ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ బౌలింగ్‌లోనూ తనదైన ముద్ర వేశారు. 2009 సీజన్లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతూ ఏకంగా రెండు సార్లు హ్యాట్రిక్కులు పడగొట్టారు. ఒకే సీజన్లో రెండు హ్యాట్రిక్కులు తీసిన ఏకైక బౌలర్‌గా యువరాజ్ ఒక రికార్డ్ సృష్టించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆ సీజన్ మొత్తంలో అతను తీసిన వికెట్లు కేవలం ఆరు మాత్రమే, ఆ ఆరూ ఈ రెండు హ్యాట్రిక్కుల రూపంలోనే రావడం గమనార్హం. రోహిత్ శర్మ కూడా అదే ఏడాది హ్యాట్రిక్ తీయడంతో 2009 సీజన్లో అత్యధికంగా మూడు హ్యాట్రిక్కులు నమోదయ్యాయి.

చాహల్ లేటెస్ట్ మ్యాజిక్

ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ యుజ్వేంద్ర చాహల్, తన హ్యాట్రిక్‌ల జాబితాను కూడా పెంచుకుంటున్నారు. ఐపీఎల్ 2025 సీజన్లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతూ చెన్నై సూపర్ కింగ్స్‌పై హ్యాట్రిక్ సాధించారు. 19వ ఓవర్లో వరుసగా దీపక్ హుడా, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్‌ల వికెట్లు తీసి చాహల్ ఈ ఘనత అందుకున్నారు. దీంతో మిశ్రా, యువరాజ్ సరసన మల్టిపుల్ హ్యాట్రిక్ లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ కూడా చేరారు.

శామ్ కరన్ వెరైటీ రికార్డు- రెండు ఓవర్ల హ్యాట్రిక్

ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ శామ్ కరన్ ఐపీఎల్‌లో ఒక వెరైటీ హ్యాట్రిక్ రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. 2019లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఆడుతున్నప్పుడు రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి హ్యాట్రిక్ పూర్తి చేశారు. ఒక ఓవర్ చివరి బంతికి వికెట్ తీసి, తన తదుపరి ఓవర్లోని మొదటి రెండు బంతులకు వికెట్లు పడగొట్టడం ద్వారా ఈ ఫీట్ సాధించారు. ఐపీఎల్‌లో రెండు వేర్వేరు ఓవర్ల స్పెల్స్‌లో కలిపి హ్యాట్రిక్ తీసిన ఏకైక బౌలర్‌గా శామ్ కరన్ గుర్తింపు పొందారు.

టీమ్స్, వేదికల రికార్డులు

ఇక జట్ల పరంగా చూస్తే పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు అత్యధికంగా చెరో 5 హ్యాట్రిక్కులు సాధించి టాప్‌లో ఉన్నాయి. అంటే ఈ జట్ల బౌలర్లు ప్రత్యర్థి టీమ్‌లను ఎక్కువగా హ్యాట్రిక్కులతో దెబ్బతీశారు. ఇక దురదృష్టవశాత్తూ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అత్యధికంగా 4 సార్లు హ్యాట్రిక్కులకు బలైంది, అంటే ఈ టీమ్ బ్యాటర్లు నాలుగు సార్లు వరుసగా వికెట్లు ఇచ్చుకున్నారు. ఇక మైదానాల విషయానికి వస్తే, అహ్మదాబాద్, బెంగళూరు స్టేడియాలు హ్యాట్రిక్కులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఈ రెండు వేదికల్లోనే అత్యధికంగా చెరో మూడు సార్లు బౌలర్లు ఈ అరుదైన హ్యాట్రిక్ ఫీట్ సాధించారు. ఓవర్సీస్ ప్లేయర్లలో దక్షిణాఫ్రికా పేసర్ మఖాయ ఎన్తిని ఐపీఎల్‌లో తొలి ఓవర్సీస్ హ్యాట్రిక్ వీరుడిగా నిలిచారు. ఐపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించడం అనేది కేవలం అదృష్టం మాత్రమే కాదు, బౌలర్‌కు టాలెంట్ కూడా హై రేంజ్‌లోనే ఉండాలి. ఇక రాబోయే సీజన్లలో మరెంత మంది ఈ హ్యాట్రిక్ క్లబ్‌లో చేరుతారో చూడాలి.

# SRH ప్రాక్టీస్ మ్యాచ్‌లో రచ్చ- ఇషాన్‌కు వేలు చూపించిన బౌలర్- ఇద్దరి మధ్య సీరియస్ మూమెంట్!

ఎస్ఆర్‌హెచ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఇషాన్, జీషన్ మధ్య వాగ్వాదం- ఒకే ఓవర్‌లో 20 పరుగులిచ్చి ఇషాన్‌ను అవుట్ చేసిన జీషన్- వికెట్ తీశాక కెప్టెన్‌కు వేలు చూపిస్తూ అగ్రెసివ్ సెండాఫ్




ఐపీఎల్ 2026 హంగామా మొదలవ్వడానికి ఇంకా కొద్ది రోజులే సమయం ఉంది. ఈ లోపు అన్ని జట్లు ప్రాక్టీస్ మ్యాచులతో తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే, సన్ రైజర్స్ హైదరాబాద్ ఎస్ఆర్ హెచ్ క్యాంప్‌లో జరిగిన ఒక సంఘటన ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా ప్రాక్టీస్ మ్యాచులు అంటే ఆటగాళ్ల ఫామ్‌ను పరీక్షించుకోవడానికి జరుగుతుంటాయి. కానీ ఎస్ఆర్‌హెచ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో మాత్రం సీన్ రివర్స్ అయింది. మైదానంలోనే ఆటగాళ్ల మధ్య వాగ్వాదం జరగడం, ఒకరిపై ఒకరు కోపంతో ఊగిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు జట్టు కెప్టెన్‌నే ఒక బౌలర్ ఎందుకు ఎదిరించాల్సి వచ్చింది ఆ సమయంలో అక్కడ ఏం జరిగిందో ఇప్పుడు వివరంగా చూద్దాం.

కెప్టెన్‌పై బౌలర్ పంజా- ప్రాక్టీస్ మ్యాచ్‌లో హీట్

ఎస్ఆర్‌హెచ్ అంతర్గత ప్రాక్టీస్ మ్యాచ్ జరుగుతుండగా, స్టాండ్ ఇన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఈ వివాదం జరిగింది. లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ వేసిన ఒక ఓవర్‌లో ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విరుచుకుపడి 20 పరుగులు రాబట్టాడు. అయితే, అదే ఓవర్ చివరి బంతికి జీషన్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఇషాన్ కిషన్‌ను అవుట్ చేశాడు. వికెట్ తీసిన జోష్‌లో జీషన్ తన వేలు చూపిస్తూ ఇషాన్‌కు ఘాటైన సెండాఫ్ ఇవ్వడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

ఇషాన్ కిషన్ సీరియస్- మైదానంలో వాగ్వాదం

జీషన్ అన్సారీ ప్రవర్తన చూసిన ఇషాన్ కిషన్ వెంటనే క్రీజులో ఆగిపోయి బౌలర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఒక చిన్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో అదీ తన జట్టు కెప్టెన్‌పై బౌలర్ అలా వేలు చూపించడం ఇషాన్‌కు నచ్చలేదు. వీరిద్దరి మధ్య కొద్దిసేపు వేడి వాతావరణం కొనసాగడం కెమెరాల్లో రికార్డ్ అయింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో, బౌలర్ ప్రవర్తన సరిగ్గా లేదని కొందరు ఫ్యాన్స్ విమర్శిస్తుండగా, మరికొందరు మాత్రం ఇది కేవలం ఆటలో భాగమని సమర్థిస్తున్నారు.

స్నేహపూర్వక సంభాషణేనా క్లారిటీ ఇచ్చిన నెటిజన్లు

ఈ గొడవపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండగా, కొందరు అభిమానులు మరో కోణాన్ని కూడా బయటపెట్టారు. ఆ సమయంలో ఇషాన్ కిషన్ ముఖంపై చిరునవ్వు కూడా కనిపించిందని, ఇది కేవలం స్నేహితుల మధ్య జరిగే సరదా పోరే అని వారు వాదిస్తున్నారు. ప్రాక్టీస్ మ్యాచుల్లో ఆటగాళ్ల మధ్య ఇలాంటి చిన్న చిన్న గొడవలు సహజమేనని, ఒకే జట్టు కోసం ఆడేటప్పుడు ఇలాంటివి సీరియస్‌గా తీసుకోకూడదని మరికొందరు సూచిస్తున్నారు.

రిథమ్‌లో ఉన్న ఇషాన్

వివాదాన్ని పక్కన పెడితే, క్రికెట్ పరంగా ఎస్ఆర్‌హెచ్‌కు ఇది మంచి పరిణామమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌లో మంచి రిథమ్‌లో ఉండటం, జీషన్ అన్సారీ ధీటుగా బౌలింగ్ చేసి వికెట్ తీయడం జట్టుకు కలిసొచ్చే అంశం. ఐపీఎల్ వంటి హై ప్రెజర్ టోర్నమెంట్‌లో ఇలాంటి దూకుడు అవసరమేనని కోచింగ్ స్టాఫ్ కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కమిన్స్ లేని లోటు తీర్చేలా ఇషాన్ జట్టును సమర్థవంతంగా నడిపిస్తున్నాడు.

ఎస్ఆర్‌హెచ్ శిబిరంలో తీవ్రమైన పోటీ

ఎస్ఆర్‌హెచ్ శిబిరంలో ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. తుది జట్టులో స్థానం కోసం ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్లలో కూడా తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక లేటెస్ట్ గా జరిగిన ఇషాన్, జీషన్ ఉదంతం కూడా ఈ పోటీతత్వానికి ఒక నిదర్శనమని చెప్పవచ్చు. యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుకోవడానికి సీనియర్లపై కూడా పైచేయి సాధించాలని చూడటం ఒక రకంగా జట్టులో గెలవడానికి ఉపయోగపడదే.

ఆర్‌సీబీతో తొలి పోరు- సిద్ధమవుతున్న ఆరెంజ్ ఆర్మీ

మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఎస్ఆర్‌హెచ్ తలపడనుంది. ఈ మెగా పోరుకు ముందు జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్ వివాదం ఆటగాళ్లను మానసికంగా సిద్ధం చేసేలా ఉంది. జట్టులోని లోపాలను సరిదిద్దుకుని పక్కా ప్లాన్‌తో బరిలోకి దిగాలని ఎస్ఆర్‌హెచ్ మేనేజ్మెంట్ చూస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యూహాలకు పదును పెడుతూ మ్యాచులను నిర్వహిస్తోంది. ఏదేమైనా క్రికెట్ మైదానంలో ఆటగాళ్ల మధ్య ఇలాంటి పరిస్థితులు సహజం. ముఖ్యంగా ఐపీఎల్ లాంటి టోర్నీకి ముందు ఆటగాళ్లు ఎంత సీరియస్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారో ఈ మూమెంట్స్ చూస్తేనే అర్థమవుతుంది. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో ఎస్ఆర్‌హెచ్ ఈసారి ఎలాంటి ఫలితాలను సాధిస్తుందో చూడాలి. ఆరంభ మ్యాచుల్లో కమిన్స్ లేని లోటును ఇషాన్ తన బ్యాటింగ్ అలాగే నాయకత్వంతో భర్తీ చేస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఐపీఎల్ చరిత్రలో చెక్కుచెదరని రికార్డులు- విరాట్ కోహ్లీ నుంచి క్రిస్ గేల్ వరకు- కొత్త సీజన్‌లోనైనా ఇవి బద్దలయ్యేనా

విరాట్ కోహ్లీ ఆ పరుగుల రికార్డు ఇప్పటికీ అలాగే క్రిస్ గేల్ 30 బంతుల్లోనే మెరుపు సెంచరీ- అమిత్ మిశ్రా పేరిట మూడు ఐపీఎల్ హ్యాట్రిక్కులు- గంభీర్ కెప్టెన్సీలో కేకేఆర్ వరుసగా 10 విజయాలు




ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ ఐపీఎల్ మరో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. మార్చి 28 నుంచి 2026 సీజన్ ప్రారంభం కానుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. గత 18 ఏళ్ల ప్రయాణంలో ఈ లీగ్ ఎన్నో అద్భుతమైన రికార్డులకు వేదికైంది. అయితే వాటిలో కొన్ని రికార్డులు మాత్రం అన్‌బ్రేకబుల్ అనిపించేలా ఉన్నాయి. టెక్నాలజీ మారుతున్నా, ఆటగాళ్ల బ్యాటింగ్ శైలిలో విప్లవాత్మక మార్పులు వచ్చినా ఈ పాత రికార్డులను అధిగమించడం ప్రస్తుత తరం ఆటగాళ్లకు ఒక పెద్ద సవాలుగా మారింది. ఐపీఎల్ చరిత్రలో నిలిచిపోయిన అటువంటి కొన్ని అరుదైన రికార్డుల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

ఏబీ డివిలియర్స్- ఒకే సీజన్‌లో అత్యధిక క్యాచ్‌లు

ఫీల్డింగ్ లో చురుగ్గా ఉంటేనే టీ20ల్లో గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ ఈ విషయంలో తనదైన రికార్డును సృష్టించారు. 2016 సీజన్ లో ఆయన ఏకంగా 19 క్యాచ్‌లు పట్టి ఫీల్డర్ గా సరికొత్త రికార్డును అందుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 2023లో 17 క్యాచ్‌లతో ఈ రికార్డుకు దగ్గరగా వచ్చారు కానీ దాన్ని అధిగమించలేకపోయారు. బౌండరీ లైన్ వద్ద చిరుతపులిలా కదిలే ఏబీడీ పట్టిన ఆ క్యాచ్‌ల రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది.

కోహ్లీ డివిలియర్స్- భారీ భాగస్వామ్యం

ఐపీఎల్ లోనే అత్యుత్తమ బ్యాటింగ్ కాంబినేషన్ గా పేరుగాంచిన విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ తమ ప్రదర్శనతో మైదానంలో విధ్వంసం సృష్టించేవారు. 2016లో గుజరాత్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వీరిద్దరూ కలిసి ఏకంగా 229 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఒకే ఇన్నింగ్స్‌లో రెండు సెంచరీలు నమోదు కావడమే కాకుండా, ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే రెండో అత్యుత్తమ భాగస్వామ్యం కూడా వీరిద్దరి పేరిటే ఉండటం విశేషం.

అల్జారీ జోసెఫ్- అరంగేట్రంలోనే అద్భుత బౌలింగ్

ఏ బౌలరైనా తన తొలి మ్యాచ్ లో వికెట్ తీయాలని కోరుకుంటాడు, కానీ అల్జారీ జోసెఫ్ మాత్రం అరంగేట్రంలోనే చరిత్ర తిరగరాశారు. 2019లో ముంబయి ఇండియన్స్ తరపున సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను కేవలం 12 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు 2008లో సోహైల్ తన్వీర్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. అరంగేట్రంలోనే ఇలాంటి గణాంకాలు నమోదు చేయడం మరే ఇతర బౌలర్‌కూ సాధ్యపడలేదు.

అమిత్ మిశ్రా- హ్యాట్రిక్కుల రారాజు

బౌలింగ్ లో హ్యాట్రిక్ సాధించడం అనేది చాలా అరుదుగా జరిగే విషయం. అటువంటిది లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా ఐపీఎల్ లో ఏకంగా మూడు సార్లు హ్యాట్రిక్కులు సాధించి తన సత్తా చాటారు. ఢిల్లీ క్యాపిటల్స్, డెక్కన్ చార్జర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల తరపున అతను ఈ ఘనత సాధించడం విశేషం. యువరాజ్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ చెరో రెండు హ్యాట్రిక్కులతో రెండో స్థానంలో ఉన్నారు. అమిత్ మిశ్రా సృష్టించిన ఈ మార్కును చేరుకోవడం ప్రస్తుత స్పిన్నర్లకు సవాలుగా మారింది.

గౌతమ్ గంభీర్, కేకేఆర్ వరుస విజయాల రికార్డు

కెప్టెన్ గా జట్టును విజయపథంలో నడిపించడంలో గౌతమ్ గంభీర్ స్టైలే వేరు. ఆయన నాయకత్వంలో కోల్‌కతా నైట్ రైడర్స్ 2014-15 సీజన్లలో వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి రికార్డు సృష్టించింది. లీగ్ లో ఏ జట్టుకైనా వరుసగా ఇన్ని మ్యాచులు గెలవడం అనేది ఎంతో శ్రమతో కూడుకున్న పని. గంభీర్ అందించిన ఆ స్ఫూర్తితో కేకేఆర్ అప్పట్లో పవర్ఫుల్ జట్టుగా అవతరించింది.

క్రిస్ గేల్- పవర్ ఫుల్ హిట్టర్ సృష్టించిన భారీ స్కోరు

యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ బ్యాట్ ఝులిపిస్తే బంతి స్టేడియం బయట పడాల్సిందే. 2013 సీజన్ లో పుణే వారియర్స్ ఇండియాపై గేల్ ఆడిన 175 నాటౌట్ ఇన్నింగ్స్ ఇప్పటికీ ఒక అద్భుతం. టీ20 క్రికెట్ లో ఒకే వ్యక్తి ఇన్ని పరుగులు చేయడం అనేది ఎవరూ ఊహించని విషయం. ఆ ఇన్నింగ్స్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఆ రికార్డును టచ్ చేయడం కూడా ఇప్పటివరకు ఏ బ్యాటర్‌కూ సాధ్యం కాలేదు. కేవలం అత్యధిక స్కోరు మాత్రమే కాదు, వేగవంతమైన సెంచరీ రికార్డు కూడా క్రిస్ గేల్ పేరిటే ఉంది. పుణే వారియర్స్ పై కేవలం 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశారు. ఆ తర్వాత 2025 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరపున వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లో సెంచరీ చేసి దగ్గరకు వచ్చినా, గేల్ 30 బంతుల మార్కు మాత్రం ఇంకా చెక్కుచెదరకుండా ఉంది. తక్కువ బంతుల్లోనే మ్యాచ్ ఫలితాన్ని మార్చేయడంలో గేల్ ను మించిన వారు లేరని ఈ రికార్డు చెబుతుంది. ఒక ఐపీఎల్ సీజన్ లో 500 లేదా 600 పరుగులు చేస్తేనే గొప్పగా భావిస్తారు. అటువంటిది విరాట్ కోహ్లీ 2016 సీజన్ లో ఏకంగా 973 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఆ సీజన్ లో అతను నాలుగు సెంచరీలు సాధించి రికార్డు సృష్టించారు. గతేడాది శుభ్‌మన్ గిల్ 890 పరుగులతో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ కోహ్లీ 900 మార్కును మాత్రం చేరుకోలేకపోయారు. కోహ్లీ సృష్టించిన ఈ పరుగుల పర్వతం ఇప్పటికీ ఐపీఎల్ చరిత్రలో అందుకోలేని రికార్డుగా నిలిచిపోయింది. ఐపీఎల్ రికార్డులు పుట్టేదే బద్దలవ్వడానికి అంటారు, కానీ పైన పేర్కొన్న రికార్డులు మాత్రం అంత ఈజీగా బ్రేక్ చేసేవి కావు. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న 2026 సీజన్ లో కొత్త ఆటగాళ్లు ఈ పాత రికార్డులపై గురి పెడతారా? లేదా ఈ ఏడాది కూడా ఇవి చెక్కుచెదరకుండా ఉంటాయా? అనేది వేచి చూడాలి.

# మెదక్ జిల్లా ఏడుపాయలలో భక్తజన సందడి...

## వనమంతా జనం.. జలమంతా వనం...





మెదక్// **మార్చి 22 (ఆకాంక్ష)** : ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో కళకళలాడింది. పాపన్నపేట మండలం నాగ్సన్‌పల్లి గ్రామ శివారులో మంజీరా నది ఒడ్డున వెలసిన ఈ ప్రసిద్ధ దేవస్థానానికి ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయాయి.నేడు ఉదయం వేద పండితులు అమ్మవారికి మంజీరా నదీ జలాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రకరకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించగా, ఆ దివ్యరూపాన్ని దర్శించేందుకు భక్తులు ఉత్సాహంగా బారులు తీశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారికి తమ తమ మొక్కులను చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంతమంతా సుమారు రెండు కిలోమీటర్ల మేర భక్తులతో నిండిపోయిందని స్థానికులు తెలిపారు. ఉచిత దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, భద్రతా చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఆలయ ఈవో కార్యనిర్వహణ అధికారి వీరేశం పర్యవేక్షణలో ఏర్పాట్లు సమర్థంగా నిర్వహించబడగా, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నియంత్రణ చర్యలు చేపట్టడంతో దర్శనాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి.ఆధ్యాత్మిక వాతావరణం, మంజీరా నది తీర సోయగాలు, భక్తుల గోవిందనామ స్మరణతో ఏడుపాయల క్షేత్రం ఆదివారం ఆధ్యాత్మిక కాంతులతో మెరిసిపోయింది. "వనమంతా జనం.. జలమంతా వనం.." అన్నట్టుగా క్షేత్రం మొత్తం భక్తిరసంతో నిండిపోయింది.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో ముగిసిన

# పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష...





నాగర్‌కర్నూల్//**మార్చి 22 (ఆకాంక్ష)** : పేద గ్రామీణ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో నాణ్యమైన ఉచిత శాస్త్రీయ విద్య అందించాలనే లక్ష్యంతో పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల 6వ, 8వ తరగతుల ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో సజావుగా ముగిసింది. హైదరాబాద్ కూకట్‌పల్లి కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ ట్రస్ట్ ప్రతిఏటా ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి ఉచిత విద్యను అందిస్తోంది.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యం. శ్రీధర్ శర్మ మాట్లాడుతూ, పేద మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన శాస్త్రీయ విద్యను ఉచితంగా అందించేందుకు 2012లో ఏర్పాటు చేసిన పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. 2016 నుంచి ప్రవేశ పరీక్ష పద్ధతిలో మెరిట్ ఆధారంగా 6వ, 8వ తరగతుల్లో అడ్మిషన్లు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని పేర్కొన్నారు.5వ మరియు 7వ తరగతులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించడం ద్వారా గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు చేరువవుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 36 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు.పరీక్షా కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు సి. తిరుపతయ్య ప్రశ్నాపత్రాల సీల్‌ను తీసి విడుదల చేయగా, నాగర్‌కర్నూల్ మండల ప్రధాన కార్యదర్శి జి. బాల్‌రాజ్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వాలంటీర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.పేద విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం ఇలాంటి విద్యాసేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో చిన్నారుల 'పట్టాభిషేకం'...

## ఘనంగా యూకేజీ స్వాగతోత్సవం...



పెద్దపల్లిటౌన్//**మార్చి 22 (ఆకాంక్ష)** :పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో యూకేజీ విద్యార్థుల కాన్వకేషన్ స్వాగతోత్సవంలో వేడుకలు ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తి చేసి, ప్రాథమిక విద్యలో తొలి మెట్టైన ఒకటో తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం ఘనంగా వీడ్కోలు పలికింది.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ చిన్నారుల సందడితో కళకళలాడింది. గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించిన యూకేజీ విద్యార్థులు వేదికపై పట్టాలు అందుకుంటూ అందరి మన్ననలు పొందారు. చిన్నారుల అమాయక హావభావాలు, ముద్దుముద్దు మాటలు, వారి ఆనందోత్సాహాలు తల్లిదండ్రులను భావోద్వేగానికి గురి చేశాయి. సభ అంతా హర్షధ్వానాలతో మార్మోగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో పూర్వ ప్రాథమిక దశ అత్యంత కీలకమైనదని అన్నారు. ఆటపాటలతో కూడిన ఈ దశలోనే పిల్లల్లో నేర్చుకోవాలనే ఆసక్తి, జిజ్ఞాస పెరుగుతుందని పేర్కొన్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది ఈ దశలోనే పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.స్వాగతోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు నృత్యాలు, పాటలతో ప్రేక్షకులను అలరించగా, వేదికపై తమ గురువులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేయడం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల ప్రతిభకు సభికులు అభినందనలు తెలియజేశారు.ఈ వేడుకలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల విద్యా ప్రస్థానంలో ఇది ఒక మధురమైన మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# గోదావరిఖని 41వ డివిజన్ అభివృద్ధికి సహకరించండి...

## మేయర్‌ను కలిసిన సీపీఐ కార్పొరేటర్ మార్కాపురి సూర్య...



గోదావరిఖని//**మార్చి 22 (ఆకాంక్ష)** : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా సహకరించాలని, రాబోయే బడ్జెట్ సమావేశంలో డివిజన్‌కు అవసరమైన అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని సీపీఐ కార్పొరేటర్ మార్కాపురి సూర్య మేయర్ మహంకాళి స్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మార్కాపురి సూర్య మాట్లాడుతూ, 41వ డివిజన్‌లో ప్రధాన నాలా దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉందన్నారు. ఆ నాలా ఇండ్ల మధ్యగానే ప్రవహిస్తుండటంతో అది జాం అయిన ప్రతిసారి తీవ్ర దుర్వాసన వ్యాపించి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రజా పాలన కార్యక్రమంలో 41వ డివిజన్‌లో నాలా శుద్ధి చేసే అవకాశం రాలేదని, కాబట్టి మేయర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శానిటేషన్ విభాగానికి ఆదేశాలు జారీ చేసి వెంటనే నాలా శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రధాన నాలా అనేక చోట్ల, ముఖ్యంగా మూల మలుపుల వద్ద దెబ్బతిన్నదని, దీని ప్రభావం సమీప ఇళ్లపై, పునాదులపై పడుతున్నదని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 41వ డివిజన్‌లోని ప్రధాన నాలాను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.ఇక ప్రధాన నాలాకు అనుసంధానంగా ఉన్న కనెక్టింగ్ నాలాలు, చిన్న కాలువలు కొన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటిపైనా కార్పొరేషన్ దృష్టి సారించాలని కోరారు. అలాగే డివిజన్‌లో ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అక్కడ సుమారు 150 నుంచి 200 కుటుంబాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలపై మేయర్ మహంకాళి స్వామి సానుకూలంగా స్పందించినట్లు మార్కాపురి సూర్య తెలిపారు. త్వరలోనే 41వ డివిజన్ పర్యటనకు వస్తానని, స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించి కోరిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తానని మేయర్ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

# బిజినేపల్లి పరిధిలో జుట్టాయికుంట వివాదంపై తప్పుడు ఆరోపణలు చేయొద్దు...

## సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 22 (ఆకాంక్ష)** : నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యేపై నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బిజినేపల్లి మండల పరిధికి చెందిన సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిజినేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458లో ఉన్న జుట్టాయికుంట శిఖంను అక్రమంగా చదును చేయాలని కొందరు ప్రయత్నించారని, ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే మార్చి 16న తామే మొదటగా బిజినేపల్లి మండల తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.అనంతరం ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మరియు సంబంధిత అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే అండతో కుంట కబ్జా జరిగిందని ఆరోపణలు చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు.ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకులైనా ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు, అవాస్తవాలు పరిశీలించి మాట్లాడాలని హితవు పలికారు. నిజానిజాలు తెలుసుకోకుండా చౌకబారు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న కూచుకుళ్ల కుటుంబం ఎప్పుడూ అవినీతి, అన్యాయాలకు ప్రోత్సాహం ఇవ్వలేదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని దేవాదాయ భూములు, గ్రామకంఠం భూములు, ఇతర ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించే దిశగా తాము కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొందరు సోషల్ మీడియా ద్వారా పత్రికలను, పాత్రికేయులను తప్పుదు దోవ పట్టించాలని చూస్తున్నారని, వాస్తవాలు తెలుసుకొని మాత్రమే కథనాలు ప్రచురించాలని కోరారు.ఇటీవల రెండు మూడు రోజులుగా ప్రభుత్వ సెలవులు ఉండటంతో తహసీల్దార్ విచారణ ప్రారంభించడంలో ఆలస్యం జరిగిందని, అయినప్పటికీ పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా అధికారులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. నిరాధార ఆరోపణలు చేస్తున్న వారు నిజం బయట పడిన తర్వాత ప్రజల ముందుకు రావాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మాజీ సర్పంచ్ గంగనంని తిరుపతయ్య, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, కాంగ్రెస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ముక్తార్, కత్తె ఈశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, మిద్దె సురేష్, శ్రీకాంత్, పండ్ల పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం...

## ఓదెల మండలం నుంచి భారీగా తరలిన రైతులు, నాయకులు...



ఓదెల//**మార్చి 22 (ఆకాంక్ష)** : సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి రాష్ట్ర రైతులకు అంకితం చేయనున్న సందర్భంగా, ఓదెల మండలం నుంచి ప్రభుత్వ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో పలువురు పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.అలాగే ఈ ప్రాంత రైతుల సంక్షేమం కోసం మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు.రైతులకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.నర్మెట్టలో ప్రారంభమవుతున్న ఆయిల్ పామ్ కర్మాగారం రాష్ట్ర రైతులకు, ముఖ్యంగా సాగు వైవిధ్యాన్ని ఆశ్రయిస్తున్న రైతులకు ఎంతో మేలు చేస్తుందని పాల్గొన్న వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కర్మాగారం ద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశముందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పల్ల కనకయ్య, బైరి రవి, ఢిల్లీ శంకర్, జంగం కొమురయ్య, కందుల అశోక్, సతురు రాజేశం, వెంకటేష్, గోపు రవి, కరుణాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజయ్య, మధు, అనిల్, శివశంకర్, మల్లయ్య, కనకయ్య, సాగర్ మరియు ఏఈవో రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 27న శ్రీరామనవమి మహా శోభాయాత్రకు ఆహ్వానం...



ఓదెల//**మార్చి 22 (ఆకాంక్ష)** : పెద్దపల్లి పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 27న శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కంచర బావి వద్ద నుంచి హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులతో భారీ మహా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు, హిందూ బంధువులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ వాహిని జిల్లా సభ్యుడు శతల్ల కుమార్ పిలుపునిచ్చారు.ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథులుగా శ్రీ శ్రీ శ్రీ బాలయోగి కృష్ణ మహారాజ్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఆయన శ్రీ లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులుగా మల్లారం, ఇందారు జిల్లాలో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు. అలాగే సినీ నటి కరాటే కళ్యాణి కూడా ఈ కార్యక్రమానికి హాజరై భక్తులను ఆశీర్వదించనున్నారు. ఆమె హిందూ శివంగిగా, శ్రీ అధిబాట్ల కలపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ప్రసిద్ధి చెందినవారని నిర్వాహకులు పేర్కొన్నారు.శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ మహా శోభాయాత్రలో భక్తి, ఆధ్యాత్మికత, సాంప్రదాయ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ మూర్తులతో పట్టణ వీధుల గుండా శోభాయాత్ర సాగనుండగా, భక్తుల పాల్గొనికతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడనుంది.ఈ సందర్భంగా ఓదెల మండల కేంద్రం నుంచి అధిక సంఖ్యలో హిందూ బంధువులు తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ వాహిని నాయకులు కోరారు. శ్రీరాముని నామస్మరణతో, భక్తి శ్రద్ధలతో జరగనున్న ఈ మహా శోభాయాత్ర పెద్దపల్లిలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని భావిస్తున్నారు.

## పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో

# భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్ల ఆవిష్కరణ...





మెదక్//**మార్చి 22 (ఆకాంక్ష)** : స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు కామ్రేడ్ షహీద్ భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సన్‌పల్లి గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ మెదక్ జిల్లా అధ్యక్షుడు సింధు ఉదయ్ మాట్లాడుతూ భగత్‌సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో చిన్న వయసులోనే బ్రిటిష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. వారు అమరులై ఎన్నో సంవత్సరాలు గడిచినా, నేటికీ దేశ యువతపై వారి ఆలోచనలు, త్యాగస్ఫూర్తి గాఢమైన ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు.ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు షహీద్ దివాస్ సందర్భంగా వర్ధంతి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులు, యువకులు చురుకుగా పాల్గొని భగత్‌సింగ్ ఆశయాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సిద్ధు, దిలీప్ కుమార్, రోహన్, స్టాలిన్, ప్రకాశ్, చకని తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిని

# కలిసిన గౌడ సంఘం సభ్యులు...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 22 (ఆకాంక్ష)** :నాగర్‌కర్నూల్ తాలూకా గౌడ సంఘం సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, భవిష్యత్ కార్యక్రమాలు, సమాజ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మాజీ ఎమ్మెల్యేతో సభ్యులు సుదీర్ఘంగా చర్చించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.ఇటీవల నూతనంగా ఎన్నికైన గౌడ సంఘం కమిటీ సభ్యులను మర్రి జనార్ధన్ రెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు. సమాజ సేవలో నూతన కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొని, గౌడ సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గౌడ సమాజ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.సంఘం మరింత బలోపేతం కావాలంటే సభ్యులంతా ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగితే సమాజానికి మరింత ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టవచ్చని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, నూతన కమిటీ సభ్యులు, పలువురు సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన రైతు ఉత్సవాలకు

# మండల రైతుల తరలింపు...



ఓదెల//**మార్చి 22 (ఆకాంక్ష)** : ఓదెల మండలంలోని రైతులు సిద్దిపేట జిల్లా నగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్వహించిన "ప్రజాపాలన రైతు ఉత్సవాలు" కార్యక్రమానికి భారీగా తరలివెళ్లినట్లు మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.మండలంలోని ఓదెల, కనగర్తి, ఇందుర్తి, కొలనూరు, పోత్కపల్లి గ్రామాలతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారుల పరిధిలోని పలు గ్రామాల రైతులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, పంటల వైవిధ్యీకరణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని రైతు సంక్షేమానికి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. యాసంగి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి, రైతులకు సాగు సౌకర్యాలు, పెట్టుబడి మద్దతు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.అదేవిధంగా నర్మెట్ట గ్రామంలో సుమారు రూ. 300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీతో పాటు రిఫైనరీ మిల్లును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు ఆయిల్ పామ్ సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, ఉత్పత్తులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.



రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి విధానాలను అనుసరించి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించే దిశగా అడుగులు వేయాలని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు. భూసార పరిరక్షణ, నీటి వినియోగ సామర్థ్యం, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించినట్లు తెలిపారు.మండలం నుండి కార్యక్రమానికి తరలివెళ్లిన రైతులు ఈ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించగా, ఓదెల మరియు గుండ్లపల్లి రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన దృశ్య-శ్రావ్య మాధ్యమాల ద్వారా మరికొందరు రైతులు కార్యక్రమాన్ని వీక్షించినట్లు మండల వ్యవసాయ అధికారి భాస్కర్ పేర్కొన్నారు.రైతు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, కొత్త పంట విధానాలు, పరిశ్రమల అనుసంధానం, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై నేరుగా సమాచారం అందించడంలో ఇలాంటి ఉత్సవాలు ఉపయోగపడతాయని వ్యవసాయ శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# గోదావరిఖని 40వ డివిజన్‌లో పైప్‌లైన్ లీకేజ్ సమస్య...

### ఆరు నెలలుగా రోడ్డంతా నీటి మయం..

### పట్టించుకోని అధికారులు, నాయకులపై కాలనీవాసుల ఆగ్రహం...



గోదావరిఖనిటౌన్//**మార్చి 22 (ఆకాంక్ష)** : గోదావరిఖని పట్టణంలోని 40వ డివిజన్ పరిధిలో ఎల్బీనగర్ సిపిఐ జెండా నుంచి మేదర్ బస్తి వెళ్లే ప్రధాన రోడ్డుమధ్యలో సింగరేణికి సంబంధించిన పైప్‌లైన్ లీకేజ్ సమస్య తీవ్రంగా మారింది. గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పైప్‌లైన్ నుంచి నిరంతరం నీరు లీక్ అవుతుండటంతో రోడ్డంతా పూర్తిగా నీటిమయంగా మారిందని స్థానికులు తెలిపారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ద్విచక్రవాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ప్రతిరోజూ నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా నడుచుకుంటూ వెళ్లే పాదచారులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు.ఇంత కాలంగా సమస్య కొనసాగుతున్నప్పటికీ దానిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపించారు. సమస్యను గుర్తించిన అధికారులే లేరని, నాయకులూ స్పందించకుండా చూస్తూ వెళ్లిపోతున్నారని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా కాలనీ వాసి గూడెపు రణధీర్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారిన ఈ పైప్‌లైన్ లీకేజ్ సమస్యను వెంటనే శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.స్థానికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం...

## బీఆర్ఎస్ నేతల ఆవేదన...





నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 22 (ఆకాంక్ష)** : రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరిగిందని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మర్రి జనార్దన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీలు అమలు కాలేదని, బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 17 శాతానికి తగ్గించారని ఆరోపించారు. సివిల్ కాంట్రాక్టుల్లో 42 శాతం కేటాయింపులు అమలు కాలేదని, గౌడ, రజక, విశ్వకర్మ తదితర కులాలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని విమర్శించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, అబ్దుల్ కలాం విద్యా పథకం కూడా అమలు కాలేదని తెలిపారు.హామీలు ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులతో అణచివేస్తున్నారని ఆరోపించిన నాయకులు, దళిత బంధు రూ.12 లక్షల హామీ కూడా అమలు కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలు నెరవేర్చకపోతే విద్యార్థి, యువజనులతో కలిసి ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు, మహిళలు నర్మెట్ట ఆయిల్ పామ్ కర్మాగార ప్రారంభోత్సవ సభకు భారీగా తరలింపు...




కొమరవెల్లి//మార్చి 22 (ఆకాంక్ష) : ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవానికి జనగామ జిల్లా కొమరవెల్లి మండలంలోని తపస్పల్లి గ్రామం నుంచి రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి చేత 2026 మార్చి 22న ప్రారంభం కానున్న ఈ కర్మాగారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరు ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు, కొమరవెల్లి మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ సూచనలతో తపస్పల్లి గ్రామం నుంచి ప్రత్యేకంగా బయలుదేరిన రైతులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సభలో పాల్గొనడానికి ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ సందర్భంగా తపస్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఈగ కనకరాజు ఆధ్వర్యంలో గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు, రైతులు నర్మెట్టకు వెళ్లడం జరిగింది. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి దిశగా ముందడుగని, రైతులకు ఆయిల్ పామ్ సాగు మరియు సంబంధిత పరిశ్రమల ద్వారా మరింత ప్రోత్సాహం లభిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభంతో రైతులకు పంటల విభిన్నీకరణకు అవకాశాలు పెరగడంతో పాటు, సాగు ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫెయిల్ నుంచి పిహెచ్‌డీ దాకా డా. ఆవుల సైదులు విజయగాథ...




నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 22 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం అనంతవరం గ్రామానికి చెందిన డాక్టర్ ఆవుల సైదులు కూలి పనుల నుంచి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగి అరుదైన విజయగాథ సృష్టించారు.వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన పదో తరగతిలో విఫలమైన తర్వాత నార్కట్‌పల్లి వద్ద నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. అనంతరం చదువుపై ఆసక్తితో పాలెం ఓరియంటల్ కళాశాలలో చేరి పీడీసీ, బీఏ, ఎంఏ (తెలుగు) పూర్తి చేయడంతో పాటు దూరవిద్య ద్వారా ఎంఏ సంస్కృతం కూడా పూర్తిచేశారు.ఆయన 2012లో ఏపీ సెట్, 2017లో యూజీసీ నెట్ అర్హతలు సాధించి, వనపర్తిలో 12 సంవత్సరాలు సంస్కృత అధ్యాపకుడిగా సేవలందించారు. టీఎస్‌పీఎస్సీ గురుకుల పరీక్షల్లో నాలుగో ర్యాంక్ సాధించి ప్రభుత్వ సేవలో టీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా చేరి, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కందుకూరులో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి "నాగర్‌కర్నూల్ జిల్లా శతకసాహిత్యం ఒక పరిశీలన" అంశంపై ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి మార్గదర్శకత్వంలో పిహెచ్‌డీ పూర్తి చేసిన సైదులను గురువులు, ఆచార్యులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు. కూలి నుంచి డాక్టరేట్ దాకా ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై నరేష్...




వెల్దుర్తి//మార్చి 22 (ఆకాంక్ష) : వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచి సేవా కార్యక్రమం వెల్దుర్తి మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని బింగి దొడ్డి ఆటో స్టాండ్ వద్ద బింగి దొడ్డి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కల్లె శివన్న ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆదివారం వెల్దుర్తి ఎస్సై నరేష్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలు తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో చల్లని తాగునీటిని అందించే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప సేవ అని తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన కల్లె శివన్నను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో భాగంగా కల్లె శివన్న కుమారుడు కార్తికేయ గ్లాసులలో నీటిని నింపి ప్రజలకు అందించారు. మొదటి గ్లాస్ నీటిని ఎస్సై నరేష్‌కు అందించడం జరిగింది. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలు నీటిని తాగి దాహార్తిని తీర్చుకున్నారు. మట్టి నీటి కుండలలో చల్లని నీటితో పాటు మినరల్ వాటర్ కూడా ఏర్పాటు చేసి ప్రజలకు, ఆటో స్టాండ్‌లో ఉన్న డ్రైవర్లకు తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బింగి దొడ్డి గ్రామానికి చెందిన మహేంద్ర రెడ్డి, రాంగోపాల్, బాలు, ఆర్. రాజశేఖర్, లక్ష్మణ కుమార్, కే. మదిలేటి, అలాగే వెల్దుర్తికి చెందిన 108 అంబులెన్స్ డ్రైవర్ ఉస్మాన్ భాష తదితరులు పాల్గొన్నారు.ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందిస్తూ కల్లె శివన్నను ప్రశంసించారు.

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
ఆదిలాబాద్,మంచిర్యాల జిల్లా బ్యూరోలు,
బెల్లంపల్లి, భీమారం, భీమిని, చెన్నూర్, జన్నారం,
జైపూర్, కాసిపేట, లక్సెటిపేట, మందమర్రి, నస్పూర్,
తాండూర్,వేమనపల్లి హాజీపూర్ మండల
కేంద్రాలకు విలేకరులు కావలెను
సంప్రదించండి...
8333818121
తొలి ఆకాంక్ష
TGTEL/25/A1964
akankshanews.com
తెలుగు సంచలన దిన పత్రిక

## ఆరు గ్యారెంటీలు రైతు.దళిత మహిళా సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ విఫలం...

### అంకెల గారడీతో ప్రజలను వంచించిన బడ్జెట్...

### బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్...

పెద్దపల్లిటౌన్/మార్చి 22 (ఆకాంక్ష) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను వంచించేలా ఉందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే విధంగా తయారైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణను అభివృద్ధి దిశ నుంచి తిరోగమన దిశలో నెట్టేలా ఈ బడ్జెట్ రూపొందించబడిందని ఆయన ఆరోపించారు. పెద్దపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్‌లతో కలిసి మాట్లాడిన కొప్పుల ఈశ్వర్,బడ్జెట్‌లో వాస్తవాల కంటే అంకెల మాయాజాలమే ఎక్కువగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు.ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలకు భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, బడ్జెట్ కేటాయింపుల విషయంలో మాత్రం పూర్తిగా చేతులెత్తేసిందని ఆయన మండిపడ్డారు. 2025-26 బడ్జెట్‌లో గ్యారెంటీల అమలుకు గతంలో కేటాయించిన రూ.56,083 కోట్లను ఇప్పుడు రూ.50,713 కోట్లకు తగ్గించారని, అంటే రూ.5,370 కోట్ల కోత విధించారని గణాంకాలతో వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి కోతలు విధించేదే కాదని అన్నారు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ అంశంపై బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. అలాగే యువతులకు స్కూటీల పంపిణీ హామీని పూర్తిగా పక్కనబెట్టిందని ఆరోపించారు. హామీలు ఒకటే, కేటాయింపులు మరొకటే అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు.వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, బడ్జెట్‌లో మాత్రం రైతులను తీవ్రంగా



నిరాశపరిచిందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.1,260 కోట్ల మేర కోత విధించడం రైతు వ్యతిరేక ధోరణికి నిదర్శనమని చెప్పారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం రూ.18,000 కోట్లే కేటాయించడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీకి కూడా పూర్తి స్థాయిలో నిధులు కేటాయించ లేదని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిందని, కేసీఆర్ హయాంలో 16 శాతం వార్షిక వృద్ధి రేటుతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. అలాంటి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలోనే తిరోగమనంలోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. గత ఏడాదితో పోల్చితే రాష్ట్ర సొంత పన్నుల రాబడి తగ్గిపోవడం ప్రభుత్వ ఆర్థిక వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని తెలిపారు.రూ.3.47 లక్షల కోట్ల అప్పు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి, ఆ నిధులతో రాష్ట్రంలో చేసిన ఒక్క అభివృద్ధి పనినైనా ప్రజలకు చూపగలరా అని కొప్పుల ఈశ్వర్ సవాల్ విసిరారు. అప్పులు పెరిగినా అభివృద్ధి మాత్రం కనిపించడంలేదని, సంక్షేమం పేరిట ప్రచారం మాత్రమే జరుగుతోందని విమర్శించారు. దళితుల సంక్షేమానికి సంబంధించి అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిన హామీని బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారని ఆయన మండిపడ్డారు. అలాగే గత ప్రభుత్వ కాలంలో అద్భుతంగా నడిచిన 1,023 గురుకులాలను నిర్వీర్యం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. విద్యా రంగం పట్ల కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన దృష్టి లేదని అన్నారు.గృహజ్యోతి పథకం విషయంలో కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించిందని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. రాష్ట్రంలో 60 లక్షల అర్హత గల కుటుంబాలు ఉండగా, కేవలం 48 లక్షల కుటుంబాలకే పథకాన్ని పరిమితం చేయడం ద్వారా మిగతా లబ్ధిదారులను అన్యాయానికి గురిచేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు ఎదురవుతున్నవి కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతలేనని కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బడ్జెట్ ప్రసంగం మొత్తం అబద్ధాల మయమైందని, ప్రజలను మభ్య పెట్టేందుకు సంఖ్యలతో మాయ చేయడమే ప్రభుత్వ లక్ష్యమైందని విమర్శించారు. కేసీఆర్ పేరు,ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల మదిలో నుంచి చెరిపివేయాలన్న దురుద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, గోపు ఐలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, నారదాసు మారుతీ, పూదరి చంద్రశేఖర్, కేధం కిషోర్, అఫ్జల్ బాబా, ప్రేమ్ కుమార్, గాజుల అరుణ్, నేరటి శ్రీనివాస్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, దాసరి బాలరాజు, కుమార్ నాయక్, మేకల కొమురయ్య, కుమార్ యాదవ్, బోన్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఆర్థిక దోపిడీపై సమ్మె హెచ్చరిక...

### బకాయిల భారం, మెడికల్ బోర్డు, ఉద్యోగాల సమస్యలపై కార్మిక నేతల ఆగ్రహం...

గోదావరిఖని//మార్చి 22 (ఆకాంక్ష) : సింగరేణిలో ఆర్థిక దోపిడీ కొనసాగుతోందని, దాని ప్రభావం నేరుగా కార్మికుల జీతాలు, ఉపాధి భద్రత, సంక్షేమంపై పడుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే ఏప్రిల్ నెలలో సింగరేణి వ్యాప్తంగా బొగ్గుగని కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ నెల 18న శ్రీరాంపూర్ నుంచి ప్రారంభమైన 'సేవ్ సింగరేణి జాత' ఆదివారం సాయంత్రం గోదావరిఖనికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీతారామయ్య ప్రసంగించారు. సింగరేణి కార్మికుల కోసం మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. మెడికల్ బోర్డు లేకపోవడం వల్ల సుమారు 300 మంది కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు దక్కకుండా వారి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆరోపించారు. కార్పొరేట్ మెడికల్ బోర్డును అవినీతి రహితంగా నిర్వహించడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ఏసీబీ దాడిలో పట్టుబడిన బ్రోకర్‌పై చర్యలు తీసుకోకుండా, కుంటి సాకులతో మెడికల్ బోర్డు వ్యవస్థనే నిలిపివేయడం దురుద్దేశపూర్వక చర్యగా అభివర్ణించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల కొత్త బొగ్గుగనుల ప్రారంభం నిలిచి పోయిందని, అనారోగ్యంతో




విధులు నిర్వర్తించలేని కార్మికులపై వివిధ పేర్లతో చర్యలు తీసుకోవడం అమానుషమని మండిపడ్డారు. డిస్మిస్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, హైదరాబాద్‌లో కార్మికుల సౌకర్యార్థం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని చెబుతూ యాజమాన్యం కాలయాపన చేస్తోందని సీతారామయ్య ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకుని సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణికి విద్యుత్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.50 వేల కోట్లకు చేరుకున్నాయని అన్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయకపోతే సింగరేణి సంస్థ ఆర్థికంగా మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొత్త ట్రాన్స్‌పోర్ట్ పాలసీ, జనరల్ అసిస్టెంట్, సర్వీస్ నియామక విధానాల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విజిలెన్స్ ఎంక్వైరీల పేరుతో కార్మికులను డిస్మిస్ చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. కార్మికులను కరుణలేని నిబంధనలతో వేధిస్తున్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యేల చేతుల్లోనే సింగరేణి యాజమాన్యం నడుస్తోందని రాజ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ప్రారంభించాల్సిన గనులను ప్రారంభించకుండా, ఇప్పటికే కార్మికులు అదనంగా ఉన్నారని యాజమాన్యం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 'సేవ్ సింగరేణి జాత' ద్వారా అన్ని గనుల కార్మికులను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం యాజమాన్యం కార్మిక సమస్యలను పరిష్కరించని పక్షంలో అన్ని కార్మిక సంఘాలను ఐక్య వేదికపైకి తీసుకువచ్చి సమ్మెకు సిద్ధం చేస్తామని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నెల 30న కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నాలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు గోదావరిఖని భాస్కర్‌రావు భవన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, లెనిన్, మోహన్, జాలిగం రాజు, రాంచందర్, చంద్రమోహన్ తదితరులు విప్లవ గేయాలు ఆలపించి కార్యక్రమానికి ఉత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అధ్యక్షత వహించగా, నాయకులు వై.వి.రావు, కె.వీరభద్రం, ముష్క సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, బాజీ సైదా, కనకరాజు, సూర్య, సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, విజయలక్ష్మి, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ బకాయిలను వెంటనే చెల్లించాలి...

### కొత్త గనులు ప్రారంభించాలి...

### సేవ్ సింగరేణి పోరు జాత కార్నర్ మీటింగ్ లో ఏఐటియుసి నాయకులు...

గోదావరిఖని టౌన్ //మార్చి 22 (ఆకాంక్ష) : సింగరేణి సంస్థ కు రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త గనులు ప్రారంభించాలని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తా లో జరిగిన సేవ్ సింగరేణి పోరు జాత కార్నర్ మీటింగ్ లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడం లో యాజమాన్యం వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. ముఖ్యంగా సింగరేణి లో రాజకీయ జోక్యం వల్ల కొత్త గనులు రావడం లేదని, ఉన్న గనులు మూసివేత కు దగ్గరలో ఉన్నాయని, వెంటనే కొత్త గనులను ప్రారంభించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి చెల్లించాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఏసిబి విచారణ పేరుతో నిలిపి వేసిన మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ఇవ్వడం లేదని వారు ఆరోపించారు, వెంటనే వారికి






ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఏఐటియుసి తో జరిపిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో ఒప్పుకున్న డిమాండ్ లను అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు, వెంటనే ఒప్పుకున్న డిమాండ్ లను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల కు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్ లపై సింగరేణి వ్యాప్తంగా మార్చి 30 వరకు ఏఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాత ను నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఎప్రిల్ లో సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఇట్టి సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షత వహించగా నాయకులు వీరభద్రం, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, బాజీసైదా, కనకరాజు, సూర్య, సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, విజయలక్ష్మి, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు గోదావరిఖని భాస్కర్ రావు భవన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ, లెనిన్, మోహన్, జాలిగం రాజు, రాంచందర్, చంద్ర మోహన్ లు విప్లవ గేయాలు ఆలపించారు.

## హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...

### రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్...

గోదావరిఖని//మార్చి 22 (ఆకాంక్ష) : గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పడి 800 రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 హామీలు ప్రకటించి ప్రజలను ఆకర్షించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందని కోరుకంటి చందర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరుతో ఆదినాయకత్వం ప్రజల ముందుకు వచ్చి ఎన్నో వాగ్దానాలు చేసినప్పటికీ, వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా అసెంబ్లీలో బడ్జెట్ రూపకల్పన సమయంలో హామీల అమలుకు సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టకుండా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలంటే ప్రజల పక్షాన అసెంబ్లీలో ప్రవేశపెట్టే ప్రైవేట్ బిల్లుకు మద్దతు తెలపాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.



రామగుండం నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే స్పష్టమైన వైఖరి అవలంబించాలని ఆయన సూచించారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రవేశపెట్టనున్న ప్రైవేట్ బిల్లుపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చర్చించి, దానికి చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తేవాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై ప్రభుత్వం రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అభయ హస్తం సహా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను అమలు చేయించేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తోందని కోరుకంటి చందర్ తెలిపారు. ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఈ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు మద్దతు తెలపాలని పిలుపు నిచ్చారు.తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.ఇది ప్రజాస్వామ్యానికి, రాజకీయ విలువలకు అనుకూలమైన ధోరణి కాదని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.ప్రభుత్వం తన వైఫల్యాలను దాచిపెట్టేందుకు దారి మళ్లించే రాజకీయాలు చేస్తోందని, కానీ ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని కోరుకంటి చందర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం పట్ల భవిష్యత్తులో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.ఈమీడియా సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగ్గురు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా

# కిరాణా దుకాణం ప్రారంభం



నిర్మల్ జిల్లా,భైంసా మండలం వాలేగాం గ్రామంలో దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ కార్యదర్శి పీ.లక్ష్మణ్ నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా దుకాణాన్ని ఇలేగాం సర్పంచ్ రాజమణి,దేగాం సర్పంచ్ సుష్మారెడ్డి, వాలేగాం సర్పంచ్ కాంమ్లె అశోక్ రిబ్బన్ కత్తిరించి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ దుకాణం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రమణారెడ్డి, వార్డ్ మెంబర్ కె. దిగంబర్ పటేల్ ,దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మహేష్,ఫీల్డ్ అసిస్టెంట్ ఈర్వంత్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఆకాష్,కదం మారుతీ,సాయినాథ్, ప్రైవేటు ఉపాధ్యాయుడు ఆనంద్,పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో

# మహిళ దారుణ హత్య...

### మృతురాలు రంగారెడ్డి గూడకు చెందిన పోతుల శోభారాణి



షాద్ నగర్, ,:ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదంలో మహిళ దారుణ హత్య గురైంది. స్థానికుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవునిపల్లి గ్రామపంచాయతీ రంగారెడ్డిగూడకు చెందిన పోతుల శోభారాణి (30) వివాహం మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ గ్రామానికి చెందిన రాజుతో పదేండ్ల క్రితం జరిగింది. వీరి వైవాహిక జీవితం కొన్నేండ్ల పాటు సాఫీగా సాగింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నర్సింహులుతో శోభారాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం భర్తకు తెలిసి ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో నెలరోజుల క్రితం శోభారాణి భర్త రాజును వదిలేసి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వచ్చింది. అప్పటి నుంచి నర్సింహులు శోభారాణిని పెళ్లి చేసుకుంటానని కుల పెద్దలతో భర్తతో మాట్లాడాడు. దీంతో ఆగ్రహానికి గురైన భర్త రాజు శోభారాణిని శనివారం రాత్రి అత్యంత దారుణంగా చంపి రంగారెడ్డిగూడ- తంగడపల్లి రహదారిలో చెట్ల పొదల్లో పడేశాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల చిన్నారి తల్లి శవం వద్ద రాత్రంతా రోదిస్తూ గడపడం చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతము య్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...o

## కాంగ్రెస్‌కు మాజీ మంత్రి

# జీవన్‌రెడ్డి రాజీనామా సంకేతాలు...

### ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా రాజీనామా...



జగిత్యాల//మార్చి 22 (ఆకాంక్ష): కాంగ్రెస్ పార్టీలో తనకు జరుగుతున్న అవమానాలు, నిర్లక్ష్య వైఖరిని ఇక భరించలేనని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా రాజీనామా చేయనున్నట్లు ప్రకటిస్తూ, పార్టీని వీడడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన ఒక లేఖను విడుదల చేశారు. ఈ పరిణామం జగిత్యాల జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. జీవన్‌రెడ్డి విడుదల చేసిన లేఖలో, తాను ఎంతోకాలంగా పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసినా, తనకు తగిన గౌరవం, ప్రాధాన్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తన అభిప్రాయాలను పట్టించుకోక పోవడం, పలు సందర్భాల్లో అవమానకర పరిస్థితులు ఎదురవ్వడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగడం సాధ్యం కాదు. ఆత్మగౌరవం కాపాడుకోవడం కూడా రాజకీయ జీవనంలో ముఖ్యమే" అని జీవన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా సమర్పించడంతో పాటు, తన భవిష్యత్ కార్యాచరణను కూడా అదే రోజు ప్రకటిస్తానని వెల్లడించారు.జీవన్‌రెడ్డి ఈ ప్రకటనతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం రేగింది. ఆయన తదుపరి రాజకీయ అడుగు ఏంటనే అంశంపై కార్యకర్తలు, నాయకుల మధ్య ఆసక్తికర చర్చ నడుస్తోంది. మరో రాజకీయ పార్టీలో చేరతారా, లేక స్వతంత్రంగా ప్రజల్లోకి వెళ్తారా అన్నదానిపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి.జగిత్యాల జిల్లాలో మంచి పట్టున్న నాయకుడిగా పేరున్న జీవన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 25న ఆయన ప్రకటించే భవిష్యత్ కార్యాచరణపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# జలం జీవన జ్యోతి

### మంజుల పత్తిపాటి



నిశీధిలోనూ వినిపించే నిశ్శబ్ద గానం అది జలధారల మృదుస్పర్శ; చుక్కగా పడి నేలను తాకే వేళ, భూమి హృదయం హర్షంతో కొట్టుకుంటుంది। అదృశ్యంగా సాగిపోతున్న ప్రతి చుక్కలో, అనంతకాలపు ఆశలు దాగి ఉంటాయి; దాన్ని అర్థం చేసుకున్న మనసే మహోన్నతం, దాన్ని వృధా చేసిన వేళ కాలమే ప్రశ్నిస్తుంది। వెలుగు చూడని విత్తనాలకైనా జీవం ఇచ్చేది, నిశ్శబ్దంగా జారే నీటి కరుణ; ఆ కరుణను కాపాడే చేతులే, భవిష్యత్తు వేదికను నిర్మించే శిల్పులు। ఎండిన నేలపై పగుళ్లు పడిన వేళ, ఆర్తనాదం వినిపించేది ప్రకృతిదే; ఆ స్వరం అర్థం చేసుకున్న మనిషి, జలాన్ని దేవతగా భావించి కాపాడతాడు। ఇంటి తలుపు దగ్గర జారే ఒక చుక్కనుంచి, ప్రపంచపు ప్రవాహాల వరకూ సంరక్షణ అనే ఒక చిన్న నిర్ణయం, విశాలమైన మార్పుకు మార్గదర్శకం అవుతుంది। జలమే కాదుమనసాక్షి కూడా అదే, దాన్ని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడటం; చుక్కను దాచిన వేళ చరిత్ర నిలుస్తుంది. ప్రకృతికి మనం ఇచ్చే అతి పెద్ద కానుక 'నీటి సంరక్షణ నీటిని ప్రతి ఒక్కరూ ఆదా చేయాలని కోరుకుంటూ రచన: మంజుల పత్తిపాటి చరవాణి 9347042218 యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం

## నార్సింగి సమీప ఔటర్ రింగ్

# రోడ్డుపై ఘోర ప్రమాదం...

### అతి వేగమే కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ...

హైదరాబాద్//మార్చి 22(ఆకాంక్ష ) : నార్సింగి పోలీస్ అకాడమీ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముందుగా వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వైపు నుంచి గచ్చిబౌలి దిశగా వెళ్తున్న కారు, నార్సింగి పరిధిలోని పోలీస్ అకాడమీ సమీపానికి రాగానే ముందున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, స్థానికులు మరియు సహాయక సిబ్బంది అప్రమత్తమై వారిని హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదం కారణంగా ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా రెండు లైన్లలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ఔటర్ రింగ్ రోడ్ సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన రెండు వాహనాలను తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రమాదానికి మితిమీరిన వేగమే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు, గాయపడిన వారి పరిస్థితి గురించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.ఈ ఘటనతో ఔటర్ రింగ్ రోడ్డుపై మరోసారి వేగ నియంత్రణ, జాగ్రత్తల అవసరం స్పష్టమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యంగా, అతివేగంతో వాహనాలు నడపడం వల్ల అమాయక ప్రాణాలు బలి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా ప్రతినిధులను అవమాన పరుస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు...

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, : ఆరుసార్లు వరుసగా కొల్లాపూర్ కు ఎమ్మెల్యేగా ఎన్నిక అయి, రాష్ట్ర మంత్రి గా 3సార్లు పనిచేసిన, చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కు వయసు పెరిగిపోతున్నదే తప్ప మతి తప్పి అధికార బలుపు తో రాజ్యాంగాన్ని అపహాస్యము పాలు చేస్తూ ప్రజా ప్రతినిధులను చులకన చేస్తూన్నారు అని భారతీయ జనతా పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లో బిజెపి పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు తమటం శేఖర్ గౌడ్, కొల్లాపూర్ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ , సింగోటం గ్రామ ఉప సర్పంచ్ తమటం సాయి కృష్ణ గౌడ్, మాచినేనిపల్లి సర్పంచ్ చంద్రయ్య, జగపతిరావు, మౌలాలి , మహేష్, మల్లయ్య , రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధం గా ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన కొల్లాపూర్ లోనీ ప్రతిపక్ష పార్టీల సర్పంచులను కొల్లాపూర్ శాసనసభ్యులు, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రోటోకాల్ ను పాటించ కుండా రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ అవమానిస్తున్నారనీ విమర్శించారు. ఈ సందర్భం గా బిజెపి పార్టీ నాయకులు తమటం సాయి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులు వచ్చి రెండు మూడు నెలలు అవుతున్నా గ్రామ సర్పంచులకు , గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ప్రజల చేత స్థానిక సంస్థలలో తిరస్కరింపబడి ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ గల్లి నాయకులతో కల్యాణ లక్ష్మి చెక్కులను ప్రోటోకాల్ ను పాటించకుండా పంపిణీ చేయించడం ఏమిటి... ఇది ఎంతవరకు సమంజసం.. కొల్లాపూర్ కు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి 3 పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా పదవులు వెలగ బెడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఈ మాత్రం కూడా ఇంగీత జ్ఞానం రాజకీయ పరిజ్ఞానం లేదా... అని ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావు ను ప్రశ్నించారు. గ్రామాల లోని సర్పంచులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ సర్పంచి అభ్యర్థులచే, కాంగ్రెస్ పార్టీ నాయకులచే ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేయించడం ఏమిటి... దీనికి ప్రభుత్వ అధికారులు కూడా తమ విధులను సక్రమం గా నిర్వహించ కుండా మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఊడిగం చేస్తూ ఆయన చెప్పిన దానికి గంగిరెద్దుల తలాడిస్తూ ప్రజా ప్రతినిధులు కానీ వ్యక్తులచే పంపిణీ చేయించడం ప్రజా ప్రతినిధులను అవమానించడం కాదా.. ప్రజా ప్రతినిధులు కానీ వ్యక్తులచే గ్రామాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకులచే ఓడిపోయిన అభ్యర్థుల చే ఇలా ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వం నుండి మంజూరైన పథకాల లబ్ధిదారుల పత్రాలను పంపిణీ చేయించడం ఎంతవరకు సమంజసం.. ఇది ఏ రాజ్యాంగం లో రాసి ఉందని.. ఇది రాజ్యాంగాన్ని అపహాస్యము చేస్తూ, ప్రజల చేత ఎన్నికలలో గెలిచిన ప్రజాప్రతినిధులను అవమానించడమే కాదా... అని తమటం సాయి కృష్ణ గౌడ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ను ప్రశ్నించారు. ప్రజల మద్దతుతో , ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయబద్ధం గా గెలిచిన సర్పంచులను, ప్రజా ప్రతినిధులను అవమానించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాదా... రాజ్యాంగం అంటే మంత్రి జూపల్లి కృష్ణారావు గౌరవం లేదా... ఇదేనా ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఉన్న రాజకీయ పరిజ్ఞానము ఇదేనా... ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం ఇలాగేనా.. అంటూ ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావు ను ప్రశ్నించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాగిన్ లో ఉండే ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు కాంగ్రెస్ పార్టీ నాయకుల దగ్గరికి ఎలా వెళ్లాయి... అని ఆయన ప్రశ్నిస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాకా లో ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు మంత్రి జూపల్లి కృష్ణారావు జేబు సంస్థ లాగా మారిపోయాయని ఆయన విమర్శించారు. ఎంపీడీవో దగ్గర ఉండాల్సిన ప్రభుత్వ మంజూరీ పథకాల పత్రాలు లబ్ధిదారుల కు అధికారులచే, ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధుల చే పంపిణీ చేయాల్సి ఉన్న పత్రాలను ప్రజల చేత చిదరింపబడి ఎన్నికలలో ఓడిపోయిన వార్డు సభ్యుడు స్థాయిలో కూడా ఉండని కాంగ్రెస్ పార్టీ గల్లీ నాయకులతో మంత్రి జూపల్లి కృష్ణారావు లబ్ధిదారుల పత్రాలను పంపిణీ చేయించడం ప్రభుత్వ అధికారులను తన కింది గుమస్తాలుగా చేసుకుని, ప్రభుత్వాన్ని ప్రభుత్వ అధికారులను కాంగ్రెస్ పార్టీ జేబు సంస్థ ఉద్యోగులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేస్తున్నాడని దానికి నిదర్శనాలు అని ఈ విషయాల గురించి సంబంధిత అధికారుల మీద కలెక్టర్ కు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యం లో ఫిర్యాదు చేస్తాం అని తమటం సాయి కృష్ణ గౌడ్ తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ నరేంద్ర మోడీ గ్రామ పంచాయతీలకు నిధులు ఇస్తున్నారు అని ,ఆ నిధులు ఏమన్నా బిజెపి పార్టీ అభ్యర్థి గెలిచిన గ్రామ పంచాయతీలకే ఇస్తున్నారా.. లేదు కదా అన్ని గ్రామ పంచాయతీలకు సమానంగా రాజకీయాలకు అతీతం గా కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ నరేంద్ర మోడీ నిధులు ఇస్తున్నారు కదా... ! ఈ మాత్రం నిజా నిజాలను కూడా తెలుసు కోలేని ఆరుసార్లు కొల్లాపూర్ కు ఎమ్మెల్యేగా ఎన్నిక అయి, మూడు పర్యాయాలు రాష్ట్రానికి మంత్రిగా పనిచేస్తున్న జూపల్లి కృష్ణారావు కు వయసు పెరుగుతున్న కొద్దీ రాజకీయ పరిపక్వత ను కోల్పోతున్నారని ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పత్రాలను కూడా గల్లి స్థాయి కాంగ్రెస్ లీడర్లతో పంపిణీ చేయించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచిన ప్రజాప్రతినిధులను అవమానించడమేనని తమటం సాయి కృష్ణ గౌడ్ మంత్రి తప్పుడు నిర్ణయాలను తప్పుడు పద్ధతులను విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలచే ఓట్లు వేయించబడి గెలుపొందిన ప్రజాప్రతినిధులకు వారు ఏ పార్టీ వారైనా ప్రభుత్వ పరం గా ప్రోటోకాల్ ను పాటిస్తూ వారికి తగిన గౌరవాన్ని ఇవ్వాలని లేదంటే మంత్రి జూపల్లి కృష్ణారావు నిరంకుశ అప్రజాస్వామిక పద్ధతులకు ప్రజా ప్రతినిధులను చులకన చేస్తున్న విధానాలకు నిరసనగా మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం ను బిజెపి పార్టీ ఆధ్వర్యం లో ముట్టడికి చేస్తూ మంత్రికి తగిన బుద్ధి వచ్చే విధము గా బిజెపి పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తమటం సాయి కృష్ణ గౌడ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ను హెచ్చరించారు

# తప్పు చేయకపోతే సెటిల్మెంట్లు ఎందుకు నిలదీస్తున్న ఊరి జనం

### సర్పంచ్ భర్త, పంతుల తీరుపై

### గ్రామస్తుల ఆగ్రహం




షాద్ నగర్, ,: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేముల నర్వ గ్రామంలోని చారిత్రక వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన గుప్తనిధుల తవ్వకాల వ్యవహారం ఇప్పుడు మరో సంచలన మలుపు తీసుకుంది. అక్రమంగా తవ్వకాలు జరిపి దొరికిపోయిన నిందితులు, ఇప్పుడు కేసును అణచివేయడానికి 'నోట్ల కట్టలు' ఎరవేస్తుండటం గ్రామంలో తీవ్ర కలకలం రేపుతోంది.

తప్పు ఒప్పుకున్నట్లేనా రూ. 10 లక్షల ఆఫర్ వెనుక మతలబు ఏంటి ఆలయంలో తవ్వకాలు జరిపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ భర్త మరియు స్థానిక పంతులు ఇప్పుడు గ్రామస్తుల కాళ్ల బేరానికి వస్తున్నట్లు సమాచారం. పోలీసు కేసును ఉపసంహరించుకోవాలని, ఎవరికీ తెలియకుండా సెటిల్మెంట్ చేసుకుందామని, ఇందుకోసం రూ. 10 లక్షలు ఇస్తామని గ్రామస్తులకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గ్రామస్తుల అనుమానాలు మరింత బలపడ్డాయి. "నిజంగా అక్కడ ఏమీ దొరకకపోతే, వీళ్ళు పది లక్షలు ఇవ్వడానికి ఎందుకు ముందుకు వస్తున్నారు?" అని గ్రామస్తులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆలయంలో విలువైన నిధులు దొరికాయని, అందుకే ఆ విషయాన్ని తొక్కిపెట్టేందుకు ఈ భారీ ఆఫర్ ఇస్తున్నారని ఊరి జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్ భర్త 'అధికార' దర్పం.. పంతుల 'మాయాజాలం'

గ్రామ ప్రథమ పౌరురాలి భర్త హోదాలో ఉండి ఆలయాన్ని కాపాడాల్సింది పోయి, గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడంపై ప్రజలు మండిపడుతున్నారు. హైదరాబాద్ నుండి రహస్యంగా వ్యక్తులను పిలిపించి, పంతుల సలహాలతో దైవ కార్యమనే ముసుగులో ఈ దోపిడీకి తెరలేపారని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పెద్దలకు, వార్డు మెంబర్లకు కనీస సమాచారం లేకుండా, దేవాదాయ శాఖ అనుమతులు లేకుండా ఇదంతా సాగించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని స్పష్టమవుతోంది.

'అధికారులు ఏం చేస్తున్నారు"

దేవాదాయ శాఖ ఈఓ (జూ) మౌనం వెనుక ఉన్న రహస్యం ఏంటని ప్రజలు నిలదీస్తున్నారు. ఇంత బహిరంగంగా సెటిల్మెంట్లు జరుగుతున్నా, పది లక్షల ఆఫర్లు ఇస్తున్నా అధికారులు కదలకపోవడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తేలాల్సిన నిజాలు:

ఆలయ గర్భాలయంలో తవ్విన గుంతల్లో ఏం దొరికింది

దొరికిన నిధులను ఎక్కడికి తరలించారు కేసును నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్న సర్పంచ్ భర్తపై కఠిన చర్యలు తీసుకుంటారా "మా దేవుడి సొత్తును దోచుకుని, ఇప్పుడు మాకే డబ్బులు ఆశజూపి నోరు నొక్కాలని చూస్తే ఊరుకోం" అని వేముల నర్వ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, సర్పంచ్ భర్త మరియు పంతులపై పకడ్బందీగా విచారణ జరిపి, వాస్తవాలను బయటపెట్టాలని గ్రామం ముక్తకంఠంతో కోరుతోంది. దేవాదాయ శాఖ ఈఓ వ్యవహారశైలిపై కూడా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా అన్న సందేహాలను గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హామీతోనైనా ఉన్నతాధికారులు కదిలి, సర్పంచ్ భర్త మరియు పంతులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, వాస్తవాలను బయటపెట్టాలని వేముల నర్వ గ్రామ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది.

# హైదరాబాదులో 29న నో వార్ భారీ ప్రదర్శన



విజయవాడ: యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే గ్యాస్, ఆయిల్ ధరల పెంపుతో రవాణా రంగంపై ప్రభావం ట్రంప్‌ను నిలదీయడంలో మోదీ మౌనం మోదీపై చంద్రబాబు ఒత్తిడి తేవాలి 29న హైదరాబాద్‌లో "నో వార్" భారీ ప్రదర్శన తిరుమలకు అపకీర్తి తెచ్చే వారిని పదవిలో ఉంచుతారా - విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా మానవాళిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కారణంగా భయానకమైన మరణాలు సంభవిస్తున్నప్పటికీ, దాన్ని నివారించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం డాక్టర్ కె. నారాయణ విలేకరుల సమావేశం నిర్వహించారు. యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించడానికి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి డోనాల్డ్ ట్రంప్ చేపడుతున్న చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు ధరల పెరుగుదల రవాణా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలు ఉన్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, ఈ పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై మౌనం పాటించడం సమంజసం కాదని విమర్శించారు. ముందుగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని ట్రంప్‌పై మోదీ ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేవగల నాయకుడు సీఎం నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న చంద్రబాబు, ట్రంప్‌కు మోదీ మద్దతు పలకకుండా యుద్ధాన్ని ఆపాలంటూ ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా చంద్రబాబు ముందుకు రావాలని ఆయన సూచించారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లో 'నో వార్' (యుద్ధం వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు తిరుమల తిరుపతి దేవస్థానం దర్శించుకున్నారని గుర్తుచేశారు. ఆ పవిత్ర క్షేత్రానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఛైర్మన్ పదవిలో కొనసాగించడం తగదని అభిప్రాయపడ్డారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. భక్తుల విశ్వాసానికి సంబంధించిన దేవాలయానికి ఛైర్మన్‌గా భక్తులను నియమించాలి గానీ, వ్యాపారవేత్తలను లేదా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని నియమించడం సరికాదని అన్నారు. తిరుమల ప్రతిష్టకు భంగం కలగకుండా ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

అమరావతి రాజధానిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. అయితే, ఈ విగ్రహ నిర్మాణాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించి వ్యాపార పరంగా నిర్వహించడం తగదని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ నిర్మాణం జరగాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు విడిపోయినప్పటికీ తెలుగువారి గుండెల్లో పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్థాయిగా నిలిచిపోయిందని చెప్పారు. ఆయన్ని ఒకే కులానికి పరిమితం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆయనపై వ్యక్తిగతంగా గౌరవం ఉన్నప్పటికీ, అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు.

ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వేర్వేరు రాజకీయ పార్టీల్లో ఉండటం సహజమని, అయితే ఆస్తుల కోసం బహిరంగంగా వివాదాలు జరగడం బాధాకరమని అన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన మిత్రుడని పేర్కొంటూ, ఆయన కుటుంబంలో ప్రస్తుతం జరుగుతున్న ఆస్తి వివాదాలపై విచారం వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్ విజయలక్ష్మి విడుదల చేసిన లేఖను గుర్తుచేశారు. వ్యక్తిగత ఆస్తి వివాదాలు న్యాయపరంగా లేదా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయ అంశాలపై చర్చించడం సహజమే అయినప్పటికీ, కుటుంబ వ్యవహారాలను బహిరంగంగా తీసుకురావడం కుటుంబ వ్యవస్థకు అవమానకరమని అన్నారు. ఇది వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వానికి కూడా నష్టం కలిగించే అంశమని అభిప్రాయపడ్డారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు 3 సెంట్లు, పట్టణ పేదలకు 2 సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు గృహనిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ నెల 24న సిపిఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన ఆందోళనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఇచ్చిన హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు అద్దెను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు. - యడ్ల కృష్ణ కిషోర్, ఆఫీసు కార్యదర్శి,